- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
23-11-2026

సంపుటి : 01 సంచిక :239 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 239 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

సిజేరియన్ ప్రసవాల్లో దేశంలోనే
తెలంగాణకు అగ్రస్థానం

- ప్రతీ పదిలో ఆరు సిజేరియన్లే!
- రాష్ట్రంలో 62.2 శాతంగా నమోదైన సిజేరియన్ల రేటు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏకంగా 84 శాతం సిజేరియన్లే
- జాతీయ సగటు 27.2 శాతం కంటే రెట్టింపునకు పైగా నమోదు
- అనవసర ఆపరేషన్లపై ఆడిట్ చేయాలని నిపుణుల సూచన


03

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో
మరో అల్పపీడనం!

- నవంబర్ 27 తర్వాత బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశం
- అల్పపీడనంగా బలపడే సూచనలు
- ఏపీకి ప్రస్తుతానికి తుపాను ముప్పు లేదన్న నిపుణులు
- శ్రీలంక లేదా తమిళనాడు వైపు వెళ్లే అవకాశాలే ఎక్కువ
- తూర్పు గాలులతో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు


03



సర్’ను అడ్డుకునే వారంతా
దేశద్రోహులే!

- ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకించేవారిపై బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు
- అక్రమ చొరబాటుదారులకు ఓట్లు కోరేవారు మూర్ఖులంటూ మండిపాటు
- దేశంలో పాలకులను ఎన్నుకునే అధికారం భారతీయులకే
- బీజేపీని ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని విమర్శ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ ఆరోపణలు
- రేవంత్‌రెడ్డికి బీజేపీ అంటే భయమని వ్యాఖ్య
- తెలంగాణలో సిక్కు సమాజాన్ని పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన
- ఇళ్లు, ఉపాధి, విద్యా సదుపాయాలు లేక సిక్కు కుటుంబాల ఇబ్బందులు
- ఓటర్ల జాబితాలో అక్రమ, దొంగ ఓట్ల తొలగింపే సవరణ లక్ష్యమని వెల్లడి
- దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టించేలా మహాపాదయాత్ర నిర్వహిస్తామని ప్రకటన

తెలంగాణ బ్యూరో, ప్రతినిది **నవంబర్ 22,(మహా ప్రభ)** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను అడ్డుకునే వారంతా దేశద్రోహులేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విదేశీ అక్రమ చొరబాటుదారులకు ఓట్లు కావాలని కోరుకునే వారంతా తన దృష్టిలో మూర్ఖులేనని మండిపడ్డారు. ఈ దేశంలో ప్రధాని, ముఖ్యమంత్రి మొదలుకొని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులుగా ఎవరు ఉండాలనేది నిర్ణయించే అధికారం భారతీయ పౌరులకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. అర్హులైన భారతీయుల ఓటు హక్కును కాపాడటంతో పాటు అక్రమంగా ఓటు హక్కు పొందిన వారి పేర్లను తొలగించడమే సర్ ప్రక్రియ ఉద్దేశమని వివరించారు. -మిగతా 3 లో

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు
90 సీట్లు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 90 సీట్లు, కోటి ఓట్లు సాధిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి

- రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 15 స్థానాలు గెలవాలి
- రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యత మనదే
- టీడీపీ, బీఆర్ఎస్ తరహాలో కాంగ్రెస్ కూడా పదేళ్లు పాలిస్తుంది
- ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేసే వారి తీరును గమనిస్తున్నాం
- పార్టీ క్రమశిక్షణ పాటించే వారికి భవిష్యత్తులో గుర్తింపు
- సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం
- పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపు

03

హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, సలహా కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాలు గెలుచుకుని, కోటి ఓట్లు సాధించి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన పదేళ్లపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 15 స్థానాలను గెలిచి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేయాలని నాయకులకు సూచించారు. సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని, ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు.




03

అంతరిక్షంలో ఔషధాల తయారీ దిశగా
భారత్ ముందడుగు

- అంతరిక్షంలో సరికొత్త ఔషధాల అభివృద్ధిపై దృష్టి సారించిన భారత్
- మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో ప్రోటీన్ క్రిస్టల్స్ పెరుగుదలపై శాస్త్రవేత్తల పరిశోధనలు
- బెంగళూరు టెక్ సమ్మిట్‌లో స్పేస్ ఫార్మా అవకాశాలపై విస్తృత చర్చ
- అంతరిక్ష సాంకేతికతతో కొత్త ఔషధాల రూపకల్పన సాధ్యమన్న కిరణ్ మజుందార్ షా
- 2035 నాటికి సిద్ధం కానున్న భారతీయ అంతరిక్ష కేంద్రం


03

ట్రంప్ ప్రయత్నాలకు
కిమ్ ఝలక్!

- ఫోన్ కాల్స్‌కు స్పందించని ఉత్తర కొరియా అధినేత
- ట్రంప్ పంపిన లేఖను సైతం స్వీకరించేందుకు నిరాకరణ
- గత ఏడాది నుంచే సంప్రదింపులకు అమెరికా ప్రయత్నాలు
- ఐక్యరాజ్యసమితి కార్యాలయం వద్ద లేఖ అందజేతకు యత్నం
- లేఖను తెరవకుండానే వెనక్కి ఇచ్చిన ఉత్తర కొరియా దౌత్యవేత్త
- చైనా పర్యటనలో కిమ్‌తో భేటీకి ట్రంప్ ఆసక్తి
- చివరి నిమిషం వరకు ప్రయత్నించినా ఫలించని సమావేశం
- అణ్వాయుధ దేశంగా గుర్తించాలన్న కిమ్ డిమాండ్‌తో ప్రతిష్టంభన


03

బిస్లెరీ వాటర్ లో ప్రమాదకర రసాయనాలు..

చర్యలకు సిద్ధమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ

- నీటి నమూనాల్లో మోతాదుకు మించి బ్రోమేట్ మరియు పీఏహెచ్ రసాయనాలు
- బిస్లెరీ తాగునీరు సురక్షితం కాదని తేల్చిన ల్యాబ్ పరీక్షలు
- బిస్లెరీ ఇంటర్నేషనల్‌పై లీగల్ చర్యలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి
- ఆశా కన్వెక్షనరీ చాక్లెట్ కుకీలను వెనక్కి తీసుకోవాలని ఆదేశం

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

మరో 500 రోజుల్లో కాంగ్రెస్ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభం



- కాంగ్రెస్ పతనానికి వరంగల్ గడ్డ నుంచే నాంది
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు
- వరంగల్‌ను భవిష్యత్తు నగరంగా తీర్చిదిద్దే బాధ్యత నాదే
- కోటి 67 లక్షల మంది మహిళలను లక్షాధికారులను చేయాలి
- అలా చేస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా
- దేవాదుల, కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయకుండా దిగువకు వదలొద్దు
- కాంగ్రెస్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ శూన్యం
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టిన కాంగ్రెస్, బీజేపీ
- హనుమకొండ జనచైతన్య సభలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్

ఉమ్మడి వరంగల్, నవంబర్ 22,(మహా ప్రభ) : రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటవుతుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో 500 రోజుల తర్వాత కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని, ఆ పార్టీ పతనానికి వరంగల్ గడ్డ నుంచే నాంది పలుకుతామని స్పష్టం చేశారు. గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ ఎన్నికలైనా, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలైనా, పార్లమెంటు ఎన్నికలైనా ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని అన్నారు. రానున్న అన్ని ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చెప్పినట్లుగా మోసపోతే గోసపడతామన్న మాటలను ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. -మిగతా 3 లో


03

విదేశాల్లో దేశ ప్రతిష్టను
దెబ్బతీస్తున్నారు!

- రాహుల్‌గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శలు
- విదేశీ పర్యటనల్లో భారత్‌ను అవమానించేలా మాట్లాడుతున్నారని ఆరోపణ
- దేశ ఆర్థిక వ్యవస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- పదేళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడి
- అంతర్జాతీయ సంస్థల సానుకూల గణాంకాలనూ అంగీకరించడం లేదని వ్యాఖ్య
- మోదీతో బహిరంగ చర్చకు రావాలన్న రాహుల్ సవాల్‌పై ఎద్దేవా
- వీడియోల ద్వారా సవాళ్లు విసరడం ఏమిటని ప్రశ్న
- రాహుల్‌తో చర్చకు బీజేపీ మండల అధ్యక్షుడే సరిపోతారని వ్యాఖ్య



హైదరాబాద్ కు బాంబు బెదిరింపులు..

- అప్రమత్తమైన పోలీస్ శాఖ
- హైదరాబాద్‌లో బాంబు దాడులు చేస్తామంటూ బెదిరింపు ఈమెయిల్
- నగరవ్యాప్తంగా ముమ్మరంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు
- వదంతులు నమ్మవద్దని నగర సీపీ విజ్ఞప్తి
- నిందితుల కోసం సైబర్ క్రైమ్ పోలీసుల ముమ్మర గాలింపు
- అనుమానం వస్తే వెంటనే 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచన

తెలంగాణ బ్యూరో, ప్రతినిది **నవంబర్ 22,(మహా ప్రభ)** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బాంబు దాడులు జరపనున్నట్లు వచ్చిన ఒక బెదిరింపు ఈమెయిల్‌పై హైదరాబాద్ సిటీ పోలీసులు అత్యంత వేగంగా స్పందించారు. ఈమెయిల్ అందిన వెంటనే నగరవ్యాప్తంగా విస్తృత స్థాయిలో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. నగర ప్రజల భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, ఎవరూ భయాందోళనలకు గురికావద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో నగరంలోని అనుమానిత, రద్దీ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల గస్తీని, -మిగతా 3 లో

మారుతీ సుజుకీ కార్ల ధరలు మళ్లీ పెంపు

ఎంపిక చేసిన మోడళ్లపై 0.31 శాతం పెంచిన కంపెనీ



న్యూఢిల్లీ నవంబర్ 22,(మహా ప్రభ)

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మూడుసార్లు ధరలను పెంచిన మారుతీ సుజుకీ.. తాజాగా నాలుగోసారి పెంచుతున్నట్టు ప్రకటించింది. కొన్ని ఎంపిక చేసిన మోడళ్ల ధరలను 0.3 శాతం పెంచగా.. ఈ పెరిగిన ధరలు ఆదివారం నుంచే అమల్లోకి వచ్చాయి. ముడి సరుకుల ఖర్చులు పెరగడం వల్లే ఈ ధరలను పెంచుతున్నట్టు కంపెనీ వెల్లడించింది. పెంచిన మొత్తం వ్యయంలో కొంత భాగాన్ని మార్కెట్‌పైకి మళ్లిస్తూనే వినియోగదారులపై ప్రభావం పడకుండా చేస్తామని చెప్పింది. గత సెప్టెంబర్‌లోనే కార్ల ధరలను రూ.20వేల దాకా పెంచింది. అయితే 2027 ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో ధరల సవరణలు చేపడుతామని సంకేతాలిచ్చింది.

అమెరికా ఎఫ్-16పై ఇరాన్ క్షిపణి దాడి..

ఖండించిన అమెరికా



టెహ్రాన్నవంబర్ 22,(మహా ప్రభ)

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. పర్షియన్ గల్ఫ్‌పై ప్రయాణిస్తున్న అమెరికా ఎఫ్-16 యుద్ధవిమానంపై క్షిపణి ప్రయోగించినట్లు ఇరాన్ సైన్యం శనివారం ప్రకటించింది. విమానం దెబ్బతినడంతో పైలట్ అత్యవసరంగా ల్యాండ్ అయ్యారని తెలిపింది. ఎంక్యూ-9 రీపర్ సహా ఇప్పటివరకు 58 అమెరికా డ్రోన్లను కూల్చివేసినట్లు పేర్కొంది. అయితే ఈ ఆరోపణలను అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్కామ్) ఖండించింది.పశ్చిమాసియాలో తమ యుద్ధవిమానాలేవీ దాడికి గురికాలేదని తెలిపింది. మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ.. శుద్ధి చేసిన యురేనియాన్ని మరో దేశానికి అప్పగించే ప్రసక్తే లేదన్నారు. శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత అమెరికా మళ్లీ దాడి చేయబోమని హామీ ఇవ్వాలని కోరారు. కేవలం యుద్ధం ముగించేందుకు ఏ ఒప్పందానికీ అంగీకరించబోమని, దీర్ఘకాలిక పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. గత జూన్‌లో కాల్పుల విరమణ కుదిరిన 15 రోజులకే మళ్లీ పోరు మొదలైందని గుర్తుచేశారు.

ఇజ్రాయెల్‌లో ఐక్య ప్రభుత్వం?

నెతన్యాహు పార్టీతో చర్చలు ప్రారంభించిన ఐజెన్‌కోట్



టెల్ అవీవ్,నవంబర్ 22,(మహా ప్రభ)

విపక్షాలు సహా వివిధ రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమవుతుందా? అనే దిశగా ఇజ్రాయెల్ తదుపరి ప్రభుత్వ ఏర్పాటు బాధ్యతలు చేపట్టిన గాడి ఐజెన్‌కోట్‌ప్రయత్నాలు ప్రారంభించారు. గత నెలలో జరిగిన ఇజ్రాయెల్ ఎన్నికల్లో ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని పార్టీ సహా ఐజెన్‌కోట్ నకు పూర్తి స్థాయి మెజారిటీ రాని విషయం తెలిసిందే.అయితే కొన్ని పార్టీల మద్దతుతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటుకు గాడి ఐజెన్‌కాట్ ప్రయత్నాలు చేపట్టారు. రాజకీయ ప్రతిష్టంభనను తొలగించే ప్రయత్నంలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీని ఆదివారం జరిగే విస్తృత కూటమి చర్చలకు ఆహ్వానించారు. లికుడ్ ప్రతినిధులతో చర్చలు జరపాలని తమ చర్చల బృందాన్ని ఆదేశించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. తదుపరి ప్రభుత్వ కూర్పు, అందులో నెతన్యాహు పార్టీ లికుడ్‌ను చేర్చే అంశంపై శిబిరంలోనే భేదాభిప్రాయాలు కొనసాగుతున్నాయి.

దేశాధ్యక్షుడినైన నాకంటే ఆమెకు బిడ్డపైనే ప్రేమ ఎక్కువ..

- కరోలిన్ లీవిట్ గురించి ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు..!



న్యూఢిల్లీ నవంబర్ 22,(మహా ప్రభ)

వైట్‌హౌస్ మాజీ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ పదవి నుంచి వైదొలిగినప్పటి నుంచి కొత్త సెక్రెటరీ ఎంపిక కోసం ట్రంప్ యంత్రాంగం వెతుకుతున్నది. ఇటీవల కేటీ జకారియా ను కొత్త ప్రెస్ సెక్రెటరీగా నియమించినా ఆమె పనితీరుపై విమర్శలు వచ్చాయి. ఆమె విద్యార్హతలపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. దాంతో పదవి చేపట్టిన ఐదు రోజుల్లోనే తొలగించాల్సి వచ్చింది.ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కరోలిన్ లీవిట్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాధ్యక్షుడినైన తనకంటే ఆమెకు బిడ్డపైనే ఎక్కువ ప్రేమ ఉందని అన్నారు. అందుకే ఆమె బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తిరిగి విధుల్లోకి రావడానికి ఒప్పుకోలేదని చెప్పారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీగా ఆమె హుందాగా, అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు. ఇప్పుడు ఆమె స్థానంలో మరొకరిని నియమించడం కష్టంగా మారిందన్నారు. నిజంగా ఇది చాలా పెద్ద సమస్యని, ఈ విషయాన్ని తాను ఆమెతో కూడా చెప్పానని ట్రంప్ తెలిపారు. ఆమె నాకంటే తన బిడ్డనే ఎక్కువగా ప్రేమిస్తోందని, ఇది చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రస్తుతం కరోలిన్ ఓ మీడియా సంస్థలో పని చేస్తున్నదని, త్వరలోనే ఆమె ఒక పెద్ద స్టార్ అవుతుందని ట్రంప్ పేర్కొన్నారు.

అమెరికా ఆంక్షలను తప్పించుకొనేందుకు

రహస్య ఆపరేషన్!

అధునాతన ఏఐ చిప్‌ల సేకరణకు ప్రత్యేక నిఘా బృందం ఏర్పాటు

చైనా నిఘా సంస్థ ప్రయత్నిస్తున్నదన్న ఎన్ వైటీ..ఖండించిన చైనా



బీజింగ్:నవంబర్ 22,(మహా ప్రభ)

అధునాతన సెమీకండక్టర్, కృత్రిమ మేధ చిప్‌లను సమకూర్చుకోవడం, ప్రపంచ చిప్ పరిశ్రమపై సమాచారం సేకరించడాన్ని చైనా నిఘా సంస్థ పనిగా పెట్టుకున్నదని న్యూయార్క్ టైమ్స్(ఎన్‌వైటీ) నివేదిక తెలిపింది. పాశ్చాత్య దేశాల, ముఖ్యంగా అమెరికా ఎగుమతి ఆంక్షలను తప్పించుకునేందుకు కనీసం రెండేండ్లుగా ఈ సంస్థ ఈ రహస్య ఆపరేషన్ నిర్వహిస్తున్నదని పేర్కొంది.ఈ ప్రయత్నాలకు నేతృత్వం వహించేందుకు చైనా భద్రత శాఖ అధిపతి చెన్ యిసిన్ ఆధ్వర్యంలో ఒక కార్య బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసియా, అమెరికా, యూరప్‌లకు చెందిన ప్రస్తుత, మాజీ భద్రతా-నిఘా అధికారుల నివేదికను ఉటంకించింది. అధునాతన చిప్‌లను చైనా కంపెనీలు కొనుగోలు చేయడం, దేశంలోకి అక్రమంగా తరలించడంలో తోడ్పడటంతో పాటు సెమీకండక్టర్ పరిశ్రమ, దాని సరఫరా వ్యవస్థలపై సమాచారం సేకరించడం ఈ ఆపరేషన్‌లో భాగమని వివరించింది. ఎన్విడియా మాజీ సీఈవో జెన్సన్ హువాంగ్‌పై నిఘా పెట్టేందుకు చైనా నిఘా సంస్థతో చైనా వ్యాపారవేత్త ఆలిస్ హువాంగ్ కలిసి పనిచేసినట్లు అమెరికా అధికారులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెల 21న ప్రచురితమైన ఎన్ వైటీ కథనం, అంతకు ముందు రోజు దర్యాప్తు కథనాన్ని కొనసాగించింది.

శిలాజ ఇంధనాలపై కుదరని ఏకాభిప్రాయం

-ఒప్పందం లేకుండానే ముగిసినఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు

-బొగ్గు, చమురు, సహజ వాయువుల వినియోగంపై దేశాల మధ్య విభేదాలు

అంటల్యా నవంబర్ 22,(మహా ప్రభ)

ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న భూతాపం కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై వివిధ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. తుర్కియేలోని అంటల్యాలో రెండు వారాలపాటు జరిగిన ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు (కాప్-31) ఆదివారం కీలక ఒప్పందం లేకుండానే ముగిసింది. బొగ్గు, చమురు, సహజ వాయువుల వినియోగం నుంచి వైదొలగే అంశాన్ని తుది ప్రకటనలో చేర్చాలా? వద్దా? అనేదానిపై విభేదాలు తలెత్తాయి.తుర్కియే, ఆస్ట్రేలియా రూపొందించిన ప్రతిపాదనను యూరోపియన్ యూనియన్ సహా పలు దేశాలు వ్యతిరేకించాయి.



రష్యా, సౌదీ అరేబియా శిలాజ ఇంధనాల ప్రస్తావనను వ్యతిరేకించాయి. 2023లో దుబాయ్ సదస్సులో శిలాజ ఇంధనాల నుంచి క్రమంగా వైదొలగాలని నిర్ణయించినప్పటికీ ఆ తర్వాతి చర్చల్లో దీనిపై స్పష్టత కొరవడింది. కార్బన్ క్యాప్చర్, నిల్వకు ప్రాధాన్యమివ్వడంపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పేద దేశాలకు ఆర్థిక సాయం, వాతావరణ మార్పులపై కార్యాచరణ వంటి అంశాలు వచ్చే ఏడాది ఇథియోపియా సదస్సుకు వాయిదా పడ్డాయి. అయితే విద్యుత్ వినియోగాన్ని పెంచే ప్రతిపాదనకు దాదాపు 100 దేశాలు మద్దతు తెలిపాయి. 2035 నాటికి మొత్తం ఇంధన వినియోగంలో విద్యుత్ వాటాను 21 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. పారిస్ ఒప్పందం నిర్దేశించిన 1.5 డిగ్రీల భూతాప పరిమితిని ప్రపంచం దాటడం అనివార్యమని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. ఈ శతాబ్దం చివరి నాటికి ఉష్ణోగ్రతలు 2.7-3 డిగ్రీలు పెరిగే ప్రమాదముందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. 2026 అత్యంత వేడి సంవత్సరంగా నమోదయ్యే అవకాశం 97 శాతమని బెర్క్లీ ఎర్త్ వెల్లడించింది.

జడ్జి అనుకుని ఒవైసీకి గౌరవ వందనం

యూపీ పోలీసుల పొరపాటు



సహారన్‌పూర్ నవంబర్ 22,(మహా ప్రభ)

ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలికేందుకు సిద్ధమైన పోలీసులు పొరపాటున ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి గౌరవ వందనం సమర్పించారు. శనివారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఈ ఘటన జరిగింది. ఆజాద్ సమాజ్ పార్టీ అధినేత చంద్రశేఖర్‌ను కలిసేందుకు ఒవైసీ తన భద్రతా సిబ్బందితో కలిసి సర్క్యూట్ హౌస్‌కు వచ్చారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తి రాక నేపథ్యంలో పోలీసులు ఆయనకు గౌరవ వందనం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒవైసీని న్యాయమూర్తి రాకగా పొరబడిన సిబ్బంది వెంటనే సెల్యూట్ చేస్తూ, గౌరవ వందనం సమర్పించారు. పోలీసులు తనకు సెల్యూట్ చేయడాన్ని గమనించిన ఒవైసీ అక్కడే ఆగిపోయారు. కదలకుండా నిలబడి వారి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ విచారణకు ఆదేశించారు.

భారత్ చేరుకున్న నేపాల్ ప్రధాని.

-. సోమవారం ప్రధాని మోదీతో చర్చలు



న్యూఢిల్లీ:నవంబర్ 22,(మహా ప్రభ)

నేపాల్ ప్రధాని బాలెన్ షా తొలి పర్యటనలో భాగంగా ఆదివారం భారత్ చేరుకున్నారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు స్వాగతం పలికారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలెన్ షా సమావేశం కానున్నారు. ఇంధనం, జలవిద్యుత్, రైల్వేలు, కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల రంగాలతో పాటు ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరుగనున్నాయి.కాగా, నేపాల్‌లో పలు ప్రాజెక్టులను ఇరు దేశాల ప్రధానమంత్రులు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అలాగే ఆర్థికవృద్ధి, సామాజిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పు వంటి సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తున్నది. భారతదేశం నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య, రవాణా, పెట్టుబడి భాగస్వామి ఉన్నది. భారత మార్కెట్‌లోకి పన్ను రహిత ప్రవేశాన్ని కూడా ఆ దేశం పొందుతున్నది. మరోవైపు నేపాల్, భారత్ మధ్య చాలా కాలంగా సరిహద్దు వివాదం కూడా ఉన్నది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపాని ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ స్థిరంగా వాదిస్తున్నది. మే నెలలో నేపాల్ ప్రధాని బాలెన్ షా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడానికి చైనా, బ్రిటన్ దేశాల ప్రమేయాన్ని ఆయన కోరారు. అయితే మూడో పక్షాల పాత్రను భారత్ తిరస్కరించింది. సరిహద్దు సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించుకోవడానికి ఇరు దేశాల మధ్య ఒక సుస్థిరమైన ద్వైపాక్షిక యంత్రాంగం ఉన్నదని పేర్కొంది.

విద్యార్థుల ఏఐ కాపీయింగ్..

-మంత్రి రాజీనామా దక్షిణ కొరియాలో ఘటన

సోల్ నవంబర్ 22,(మహా ప్రభ)

ఏఐ సాయంతో ఓ అభ్యర్థి కాపీయింగ్ కు పాల్పడటంతో దక్షిణ కొరియా విద్యాశాఖ మంత్రి చోయ్ క్యో-జిన్ ఆదివారం రాజీనామా చేశారు. నవంబర్ 15న జాతీయ ట్యాక్స్ అకౌంటెంట్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థి కాపీయింగ్‌కు పాల్పడినట్టు ఒప్పుకోవడంతో వివాదం మొదలైంది. సూక్ష్మ కెమెరా, స్మార్ట్‌ఫోన్ ఉపయోగించి దాదాపు పూర్తి మార్కులు సాధించినట్టు అతడు



అంగీకరించాడు. దేశంలోనే కీలకంగా భావించే 9గంటల సునెంగ్ పరీక్షలో కాపీయింగ్‌కు పాల్పడటంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో చోయ్ స్పందిస్తూ.. ప్రజలు విమర్శలకు తాను అతీతుడిని కాదని.. వారి నమ్మకాన్ని పెంచేందుకు రాజీనామా చేస్తున్నట్టు ఎక్స్ వేదికగా తెలిపారు. గురువారం జరిగిన పరీక్షలో 111 చోట్ల అక్రమాలు జరిగినట్టు అధికారులు తెలిపారు.

సిజేరియన్ ప్రసవాల్లో దేశంలోనే తెలంగాణకు అగ్రస్థానం

న్యూఢిల్లి



సిజేరియన్ ప్రసవాల విషయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న మొత్తం ప్రసవాల్లో ఏకంగా 62.2 శాతం సిజేరియన్ల ద్వారానే జరుగుతున్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా సిజేరియన్ల సగటు రేటు 27.2 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంటే రాష్ట్రంలో జరిగే ప్రతి పది ప్రసవాల్లో ఆరుకు పైగా శస్త్రచికిత్సల ద్వారానే జరుగుతున్నాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఈ సర్వే నివేదిక ప్రకారం.. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మధ్య ఈ విషయంలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏకంగా 83.9 శాతం ప్రసవాలు సిజేరియన్ల ద్వారానే సాగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ రేటు 48.1 శాతంగా ఉంది. జాతీయ స్థాయిలో ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ల సగటు 54.1 శాతం మాత్రమే కావడం గమనార్హం. గత సర్వే (2019-21)లో 60.7 శాతంగా ఉన్న సిజేరియన్ల రేటు, ఇప్పుడు 62.2 శాతానికి పెరగడం గమనార్హం. పట్టణ ప్రాంతాల్లో ఇది 70.1 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 59.5 శాతంగా నమోదైంది. ఈ గణాంకాల నేపథ్యంలో, ప్రతి సిజేరియన్‌కు సరైన వైద్య కారణం ఉందా లేదా అన్నది నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసర సిజేరియన్లను అరికట్టేందుకు ఆసుపత్రుల వారీగా ఆడిట్ నిర్వహించాలని సూచిస్తున్నారు.

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!



న్యూఢిల్లి
దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో నవంబర్ నెలాఖరులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే దీనిపై తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతానికి ఎలాంటి తుపాను హెచ్చరికలు జారీ చేయలేదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధిపతి పి.ఎల్.ఎన్. మూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 మధ్య కాలంలో దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చు. ఇది క్రమంగా బలపడి అల్పపీడనంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఇది మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా లేదా అనే అంశంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ఒకవేళ బలపడినా కూడా, అది శ్రీలంక లేదా తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ వైపు వస్తుందని చెప్పలేమని ఆయన వివరించారు. దీని తీవ్రత, ప్రయాణించే మార్గానికి సంబంధించి ఐఎండీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని తెలిపారు. సాధారణంగా ఉపరితల ఆవర్తనం అనేది వాతావరణ వ్యవస్థలలో అత్యంత ప్రాథమిక దశ మాత్రమేనని, ఇలా ఏర్పడే ప్రతి ఆవర్తనం తుపానుగా మారదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నవంబర్ 27 తర్వాత అల్పపీడనం ఏర్పడిన అనంతరమే దీని తదుపరి కదలికలపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది.

బిస్లెరీ వాటర్ లో ప్రమాదకర రసాయనాలు..



న్యూఢిల్లీ:
దేశంలో ప్రముఖ ప్యాకేజ్డ్ తాగునీటి తయారీ సంస్థ బిస్లెరీ ఇంటర్నేషనల్‌పై న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సిద్ధమైంది. సంస్థకు చెందిన నీటి నమూనాలు సురక్షితం కాదని ప్రయోగశాల పరీక్షల్లో తేలడంతో ప్రాసిక్యూషన్ ప్రక్రియకు అనుమతి ఇచ్చింది. బిస్లెరీ ప్రాంగణం నుంచి సేకరించిన తాగునీటి నమూనాల్లో తొలుత నిర్ణీత పరిమితికి మించి బ్రోమేట్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ నీటిని ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం సురక్షితం కానిదిగా ప్రకటించారు. ప్రాథమిక పరీక్ష ఫలితాలపై బిస్లెరీ సంస్థ అప్పీల్ చేయడంతో నమూనాలను రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. అక్కడ నిర్వహించిన రెండో పరీక్షలోనూ నీటి నమూనాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు (పీఏహెచ్) ఉన్నట్లు గుర్తించారు. బ్రోమేట్, పీఏహెచ్‌లను ఆరోగ్యానికి హానికరమైన, క్యాన్సర్ ముప్పుతో సంబంధం ఉన్న రసాయనాలుగా పరిగణిస్తారు. పరీక్షల నివేదికల ఆధారంగా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారించిన అధికారులు బిస్లెరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై చట్టపరమైన చర్యలకు అనుమతి మంజూరు చేశారు. ఈ పరిణామంపై బిస్లెరీ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

హైదరాబాద్ కు బాంబు బెదిరింపులు..

మొదటి తరువాయి

విజిబుల్ పోలీసింగ్‌ను మరింత ముమ్మరం చేశారు. కీలక కూడళ్లు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసి అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మరోవైపు, ఈ బెదిరింపు ఈమెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపారు అనే వివరాలను రాబట్టేందుకు నగర సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. డిజిటల్ ఆధారాలు, ఐపీ అడ్రస్‌లను విశ్లేషిస్తూ నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియాలో గానీ, బయట గానీ వచ్చే నిరాధారమైన వదంతులను ఎవరూ నమ్మవద్దని, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసి భయాందోళనలు సృష్టించవద్దని నగర ప్రజలకు సీపీ విజ్ఞప్తి చేశారు. నగరంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినా, లేదా గుర్తుతెలియని బ్యాగులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ '112' ద్వారా సమాచారం అందించాలని సూచించారు. హైదరాబాద్ పోలీస్ విభాగం 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరి రక్షణకు కట్టుబడి ఉందని అధికారులు భరోసా ఇచ్చారు.

విదేశాల్లో దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు!

చండీగఢ్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు భారత్ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలో ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం చండీగఢ్‌లో నిర్వహించిన బీజేపీ బూత్ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధిని, ఆర్థిక వ్యవస్థ సాధిస్తున్న పురోగతిని విస్మరించి రాహుల్‌గాంధీ విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రపంచ బ్యాంకు గణాంకాలను ప్రస్తావించిన నితిన్ నబీన్.. గత పదేళ్లలో దేశంలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థలు వెల్లడిస్తున్న సానుకూల ఆర్థిక గణాంకాలను కూడా రాహుల్‌గాంధీ అంగీకరించడం లేదని విమర్శించారు. దేశంలో పేదరికం తగ్గుతున్నా, ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతున్నా ప్రతిపక్ష నేత వాస్తవాలను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. విదేశాల్లో భారతదేశంపై ప్రతికూల అభిప్రాయం కలిగించేలా మాట్లాడటం ద్వారా దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్‌గాంధీ చేసిన సవాల్‌పైనా నితిన్ నబీన్ స్పందించారు. పార్లమెంట్‌లో మాట్లాడే ధైర్యం లేకుండా వీడియోల ద్వారా సవాళ్లు విసురుతున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీతో చర్చించేందుకు ప్రధాని మోదీ అవసరం లేదని, బీజేపీ మండల అధ్యక్షుడే సరిపోతారని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలు, దేశ అభివృద్ధి, ఆర్థిక పరిస్థితులపై చర్చించేందుకు ప్రతిపక్షాలకు అవకాశం ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదని విమర్శించారు.

సర్'ను అడ్డుకునే వారంతా దేశద్రోహులే!

మొదటి తరువాయి

కరీంనగర్‌లోని గురుద్వార్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన 11 కేవీ సౌర విద్యుత్ పలకలను బండి సంజయ్ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణపై తన అభిప్రాయాలను వెల్లడించారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, ఒకరికి రెండు ఓట్లు ఉంటే అదనపు ఓటును తొలగించడం, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం సర్ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. విదేశాల నుంచి అక్రమంగా వచ్చి ఓటు హక్కు పొందిన వారి పేర్లను తొలగించడంతో పాటు దొంగ ఓట్లను ఏరివేయడం ద్వారా నిజమైన భారతీయులకు ఓటు హక్కు కల్పించాలన్నదే ఈ ప్రక్రియ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన రాజకీయ వ్యాఖ్యలపైనా బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ లేదని, బీఆర్ఎస్‌తోనే తమకు పోటీ అని రేవంత్‌రెడ్డి పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీ అంటే ముఖ్యమంత్రికి భయమని, ఆ పార్టీని ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని ఆరోపించారు. బీజేపీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఆ రెండు పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని అన్నారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్‌కు లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అభివృద్ధి జరగాలన్నా, కేంద్రం నుంచి నిధులు రావాలన్నా బీజేపీతోనే సాధ్యమని ప్రజలు గుర్తించారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని, రాష్ట్రంలో ద్వంద్వ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిక్కు సమాజం పట్ల తనకు ప్రత్యేక అభిమానం ఉందని బండి సంజయ్ తెలిపారు. సిక్కులు కష్టపడి పనిచేసే వారని, దైవభక్తితో పాటు సమాజానికి సేవ చేయాలనే తపన కలిగిన వారని కొనియాడారు. గురునానక్, గురుగోబింద్‌సింగ్ బోధించిన మార్గంలో నడుస్తూ మానవత్వం, సేవాభావాన్ని చాటుకుంటారని చెప్పారు. అటక్ నుంచి కటక్ వరకు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ఆసియా నుంచి ఆఫ్రికా ఖండం వరకు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సిక్కులు కనిపిస్తారని పేర్కొన్నారు. వారు ఎక్కడ నివసించినా కష్టపడి పనిచేస్తూ ప్రశాంతమైన జీవనం కొనసాగిస్తారని అన్నారు. దేశం కోసం సిక్కు సమాజం చేసిన త్యాగాలు అసమానమైనవని బండి సంజయ్ గుర్తుచేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో సిక్కుల పాత్ర చిరస్మరణీయమని, దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సిక్కు సైనికుల సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పంజాబ్‌లో అనేక కుటుంబాలు తమ పిల్లల్లో ఒకరిని దేశ రక్షణ కోసం సైన్యంలోకి పంపాలనే భావనతో పెంచేవారని వివరించారు. సిక్కుల చరిత్రను చదివితే ధైర్యం, వారి త్యాగాలను స్మరించుకుంటే దేశభక్తి, వారి సేవలను చూస్తే మానవత్వం కనిపిస్తాయని అన్నారు. అలాంటి గొప్ప సమాజం సేవలను దేశం ఎప్పటికీ మర్చిపోకూడదని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 90 సీట్లు

-రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 15 స్థానాలు గెలవాలి
-రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యత మనదే
-టీడీపీ, బీఆర్ఎస్ తరహాలో కాంగ్రెస్ కూడా పదేళ్లు పాలిస్తుంది
-ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేసే వారి తీరును గమనిస్తున్నాం
-పార్టీ క్రమశిక్షణ పాటించే వారికి భవిష్యత్తులో గుర్తింపు
-సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం
-పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్:
వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాలు గెలుచుకుని, కోటి ఓట్లు సాధించి మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన పదేళ్లపాటు కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 15 స్థానాలను గెలుచుకుని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, సలహా కమిటీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాల్లో విజయం సాధించిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మిత్రపక్షమైన సీపీఐ ఒక స్థానాన్ని గెలుచుకుందని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ, బీఆర్ఎస్ వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చినట్లుగానే కాంగ్రెస్ కూడా మరోసారి గెలిచి పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల్లో పార్టీకి ఆదరణ పెరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీకి 240 స్థానాలకు మించి రావని తాను చెప్పానని, ఎన్నికల ఫలితాలు తన అంచనాకు అనుగుణంగా వచ్చాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నాయకులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. తెలంగాణ నుంచి 15 మంది ఎంపీలను గెలిపించుకుని, కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వానికి బలం చేకూర్చాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని ముఖ్యమంత్రి విమర్శించారు. అదే సమయంలో సొంత పార్టీ నాయకుల వ్యవహారశైలిపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై బహిరంగంగా ప్రతికూల వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ఎవరు ఏమి మాట్లాడుతున్నారు, ఎలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారనే విషయాలను పార్టీ నిశితంగా గమనిస్తోందని హెచ్చరించారు. పార్టీ నిర్ణయాలకు, క్రమశిక్షణకు అనుగుణంగా నడుచుకునే వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వం నేరుగా ప్రజల్లోకి వెళ్లనుందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సామాజిక వర్గాల స్థితిగతులను తెలుసుకునేందుకు రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ఉపయోగపడిందని తెలిపారు. ఇదే విధానాన్ని ఆధారంగా చేసుకుని దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వివరించారు. తెలంగాణలో చేపట్టిన కులగణన ఫలితాలను జాతీయ స్థాయిలోనూ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

మొదటి తరువాయి



ఆదివారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన జనచైతన్య సభలో కేటీఆర్ మాట్లాడారు. ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డితో పాటు మరో 15 మంది మాజీ కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా సంక్షేమం, అభివృద్ధి రెండింటిలోనూ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సంక్షేమం పేరుతో గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. పెన్షన్ల విషయంలోనూ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. మొదటి ఏడాదిలో లక్షన్నర పెన్షన్లను తగ్గించారని, రెండో ఏడాది మరో లక్షన్నర పెన్షన్లకు కోత పెట్టారని, మూడో ఏడాది లక్షా 20 వేల పెన్షన్లను తగ్గించారని పేర్కొన్నారు. మొత్తంగా 4 లక్షల 71 వేల పెన్షన్లకు కోత విధించి, కొత్తగా 4 లక్షల 63 వేల పెన్షన్లు మాత్రమే ఇచ్చి పెద్ద ఘనకార్యం చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో రూ.200గా ఉన్న పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.4 వేలు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చిన వరంగల్ నుంచే 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందని, అప్పట్లో తొలి సభను కూడా కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలోనే నిర్వహించామని గుర్తుచేశారు. ఇప్పుడు అదే మైదానంలో నిర్వహించిన జనచైతన్య సభ బీఆర్ఎస్ పునరాగమనానికి నాంది అవుతుందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజల మద్దతుతో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రకటనలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పడం కాదని, రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది మహిళలను లక్షాధికారులుగా చేయాలని సవాల్ విసిరారు. ఆ హామీని నెరవేరిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. ఇది వరంగల్ గడ్డ మీద నుంచి ముఖ్యమంత్రికి తాను విసురుతున్న సవాల్ అని స్పష్టం చేశారు. వరంగల్‌ను భవిష్యత్తు నగరంగా అభివృద్ధి చేసే బాధ్యతను తానే తీసుకుంటానని చెప్పారు. భవిష్యత్తు నగరం అంటే హైదరాబాద్ మాత్రమే కాదని, అన్ని రంగాల్లో వరంగల్‌ను అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే కీలక నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్‌లో నాలుగు సమాచార సాంకేతిక సంస్థలను ప్రారంభించి వెయ్యి మందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని కేటీఆర్ వివరించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పరిశ్రమలను తీసుకురావడం అటుంచి, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు కూడా తరలిపోయే పరిస్థితులు కల్పిస్తోందని విమర్శించారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వరంగల్ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేసే ప్రతిపాదనపైనా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాలకు చెందిన వారు హైదరాబాద్‌లో ప్రైవేటు విద్యాసంస్థలు ఏర్పాటు చేశారని, వాటికి ప్రయోజనం చేకూర్చేందుకే ప్రభుత్వ విద్యావ్యవస్థలో మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సింది పోయి, వాటి ఉనికినే దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. వరంగల్‌లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో 1,217 మంది కూర్చునే సామర్థ్యంతో రవీంద్రభారతి తరహాలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కార్యాలయంగా మార్చే ఆలోచన చేయడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. హనుమకొండలో జనచైతన్య సభ నిర్వహించనున్నట్లు తెలియగానే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని అన్నారు. ప్రజల సాంస్కృతిక అవసరాలకు ఉపయోగపడాల్సిన కళాక్షేత్రాన్ని మరో అవసరానికి వినియోగించాలనుకోవడం తగదని అభిప్రాయపడ్డారు. వరంగల్ చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. గోదావరి జలాల విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. గురుభక్తిని చాటుకునేందుకు తెలంగాణను ఎండబెట్టి ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి నీటిని వదులుతున్నారని ఆరోపించారు. దేవాదుల, కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి స్థానిక చెరువులు, కుంటలను నింపాల్సింది పోయి దిగువకు వదలడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి రాష్ట్రానికి అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ట్రంప్ ప్రయత్నాలకు కిమ్ ఝలక్!

వాషింగ్టన్:
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ నుంచి స్పందన కరువైంది. కిమ్‌తో మాట్లాడేందుకు ట్రంప్ పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆయన పట్టించుకోలేదని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వకపోగా, ట్రంప్ పంపిన లేఖను కూడా స్వీకరించేందుకు నిరాకరించినట్లు పేర్కొంది. గత ఏడాది నుంచే కిమ్‌తో సంప్రదింపులు జరిపేందుకు అమెరికా అధ్యక్షుడు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తొలుత అధికారిక దౌత్య మార్గాల ద్వారా కిమ్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు అమెరికా అధికారులు ప్రయత్నించారు. అయినప్పటికీ ఉత్తర కొరియా నుంచి స్పందన రాకపోవడంతో ట్రంప్ నేరుగా లేఖ పంపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితిలో ఉన్న ఉత్తర కొరియా శాశ్వత మిషన్ వద్ద అమెరికా అధికారులు లేఖను అందజేసేందుకు ప్రయత్నించారు. అక్కడి దౌత్యవేత్తకు లేఖను అందించగా, ఆయన దానిని తెరవకుండానే అమెరికా ప్రతినిధి ముందు తిరిగి ఉంచినట్లు కథనం పేర్కొంది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాల్లో నెలకొన్న దూరాన్ని మరోసారి వెల్లడించింది. ఇటీవల ఆసియా పర్యటన సందర్భంగా చైనాలో కిమ్ జోంగ్ ఉన్‌తో సమావేశమయ్యేందుకు ట్రంప్ ఆసక్తి చూపారు. అయితే ఉత్తర కొరియా నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. చివరి నిమిషం వరకు భేటీ కోసం ప్రయత్నాలు జరిగినప్పటికీ సమావేశం సాధ్యం కాలేదు. దీంతో కిమ్‌తో భేటీ లేకుండానే ట్రంప్ తన పర్యటనను ముగించుకుని అమెరికాకు తిరిగి వెళ్లారు. ఉత్తర కొరియా విధించిన షరతులు అమెరికాకు ఆమోదయోగ్యంగా లేకపోవడంతో చర్చలు ముందుకు సాగలేదని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

అంతరిక్షంలో ఔషధాల తయారీ దిశగా భారత్ ముందడుగు

న్యూఢిల్లీ:
భారతదేశం తన విస్తరిస్తున్న అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాలను ఫార్మా రంగంతో అనుసంధానించి, సరికొత్త ఔషధాల ఆవిష్కరణకు మార్గం సుగమం చేస్తోంది. అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ (భార రహిత స్థితి) వాతావరణాన్ని వినియోగించుకుని నెక్స్ట్ జనరేషన్ మందులను ఎలా అభివృద్ధి చేయవచ్చనే అంశంపై భారత శాస్త్రవేత్తలు, బయోటెక్నాలజీ క

సంపాదకీయం

కరువు కోరల్లో రైతన్న..
ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే!



రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. వ్యవసాయం నిలదొక్కుకుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుంది. కానీ తెలంగాణలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు అన్నదాతను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల కోసం అప్పులు చేసి సాగు చేసిన రైతులకు ఆశించిన దిగుబడులు దక్కలేదు. చేతికొచ్చే పంట కళ్లముందే ఎండిపోతుంటే పెట్టిన పెట్టుబడులు ఎలా తిరిగి వస్తాయో తెలియని దుస్థితి నెలకొంది. ఒకవైపు పంట నష్టం.. మరోవైపు అప్పుల భారం.. ఇంకోవైపు రానున్న పంటకు పెట్టుబడి సమకూర్చుకోవాల్సిన ఆందోళన రైతులను వెంటాడుతోంది. ఈ సమయంలో రైతుకు ధైర్యం చెప్పడమే కాకుండా ఆచరణాత్మకంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాష్ట్రంలో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించగా, వాటిలో 111 మండలాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. వర్షాల లోటు పంటల దిగుబడిపై ప్రభావం చూపడంతో పాటు భూగర్భ జలాల నిల్వలను కూడా తగ్గించింది. లక్షలాది బోర్లు ఎండిపోవడం రైతుల కష్టాలను మరింత పెంచింది. సాగునీటి కోసం విద్యుత్ వినియోగం పెరగడం, చెరువులు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం వ్యవసాయ రంగాన్ని ఒత్తిడిలోకి నెట్టాయి. ఈ పరిస్థితుల్లో రైతులు అప్పులు తీర్చలేక, కొత్త పంటకు పెట్టుబడి పెట్టలేక సతమతమవుతున్నారు. కరువు ప్రభావం ఒక్క పంటకే పరిమితం కాదు. పశుపోషణ, వ్యవసాయ కూలీల ఉపాధి, గ్రామీణ వ్యాపారాలపైనా దాని ప్రభావం పడుతుంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బ్యాంకులు రైతుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలి. పంట నష్టపోయిన రైతుల పాత రుణాల వాయిదాలను పునర్వ్యవస్థీకరించడం, అవసరమైన చోట వడ్డీ రాయితీలు కల్పించడం, కొత్త పంటకు రుణాలు అందించడం అత్యవసరం. రుణాల చెల్లింపులో జాప్యం జరిగిందనే కారణంతో రైతులకు తదుపరి రుణాలు నిరాకరిస్తే వారు ప్రైవేటు అప్పుల వైపు వెళ్లే ప్రమాదం ఉంది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సి వస్తే రైతు కుటుంబాలు మరింత ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటాయి. రబీ సాగు సమయం కోసం ఎదురుచూడదు. అందువల్ల రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు కొత్త రుణాల మంజూరులోనూ వేగం ఉండాలి. బ్యాంకులు, వ్యవసాయ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో అర్హులైన రైతులకు సకాలంలో సహాయం అందించాలి. కేవలం రుణాల వాయిదాలు పొడిగించడం మాత్రమే రైతు సమస్యకు పరిష్కారం కాదు. పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి అర్హులైన ప్రతి రైతుకూ పరిహారం అందించాలి. పంటల బీమా పరిధిలో ఉన్నవారికి పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి. బీమా సంస్థలు, అధికారుల మధ్య సమన్వయ లోపాల వల్ల రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి పారదర్శకంగా నివేదికలు రూపొందించాలి. పరిహారం పంపిణీలో రాజకీయాలకు, పక్షపాతానికి తావుండకూడదు. సాగు చేసిన భూమి, పంట రకం, నష్టం తీవ్రత ఆధారంగా న్యాయం జరగాలి. మరో ముఖ్యమైన అంశం పంటల ప్రణాళిక. నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులను ప్రోత్సహించడం అవసరం. అయితే ఏ పంట వేయాలో రైతుకు సూచించడం మాత్రమే సరిపోదు. ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ సదుపాయం, గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాల భరోసా కల్పించాలి. వరి సాగు తగ్గించాలని చెప్పి, ఇతర పంటలు పండించిన తర్వాత వాటిని కొనుగోలు చేయకపోతే రైతు నష్టపోతాడు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలంటే వాటి సేకరణ, నిల్వ, విక్రయాలకు పటిష్టమైన వ్యవస్థ అవసరం. వ్యవసాయ విధానాలు రైతుకు ఆచరణ సాధ్యంగా ఉండాలి. దీర్ఘకాలికంగా చూస్తే నీటి సంరక్షణే కరువు సమస్యకు కీలక పరిష్కారం. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, సూక్ష్మ సేద్య పద్ధతుల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామాల్లో నీటి వనరుల స్థితిగతులను అంచనా వేసి ప్రతి ప్రాంతానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి. వర్షాలు కురిసినప్పుడు నీరు వృథాగా ప్రవహించి వెళ్లిపోకుండా నిల్వ చేసుకునే ఏర్పాట్లు ఉండాలి. రైతులకు వాతావరణ సమాచారాన్ని ముందుగానే అందించి పంటల ఎంపిక, సాగు సమయంపై మార్గదర్శనం చేయాలి. ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా నివారించలేకపోయినా వాటి ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టవచ్చు. ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అవసరమే. మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వ్యవసాయ రంగాన్ని విస్మరించకూడదు. రైతు సంక్షోభంలో ఉన్నప్పుడు అతని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం పాలకుల మొదటి ప్రాధాన్యంగా ఉండాలి. కరువు మండలాల ప్రకటనతో బాధ్యత ముగిసినట్లు కాదు. ఆ ప్రకటనకు అనుగుణంగా నిధులు, రుణ సదుపాయాలు, పరిహారం, సాగునీటి చర్యలు క్షేత్రస్థాయికి చేరాలి. ప్రభుత్వం ప్రకటించిన సహాయం రైతు ఖాతాలోకి చేరినప్పుడే దానికి అర్థం ఉంటుంది. రైతు ఆదాయం, సాగు ఖర్చులు, నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సమగ్ర వ్యవసాయ విధానం రూపొందించాలి. ప్రతి కరువు కాలంలో తాత్కాలిక ఉపశమన చర్యల కోసం ఎదురుచూసే పరిస్థితి మారాలి. గ్రామస్థాయిలో నీటి నిర్వహణ, పంటల వైవిధ్యం, వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలను పెంచాలి. రైతు కుటుంబాలకు సంక్షోభ సమయంలో ఆర్థిక భద్రత కల్పించాలి. అన్నదాతను ఆదుకోవడం అంటే ఒక వ్యక్తిని కాపాడటం మాత్రమే కాదు.. ఆహార భద్రతను, గ్రామీణ ఉపాధిని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కాపాడటమే. కష్టకాలంలో రైతు పక్కన నిలబడినప్పుడే ప్రభుత్వానికి నిజమైన ప్రజా పాలన అనే గుర్తింపు లభిస్తుంది.

తూప్రాన్‌లో వివాహ వేడుకకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

-నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి..
-కేటీఆర్ రాకతో సందడిగా మారిన లింగారెడ్డి గార్డెన్స్





తూప్రాన్, నవంబర్ 22,(మహా ప్రభ)
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆదివారం ఉదయం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కేటీఆర్ రాకతో వివాహ వేడుక ప్రాంగణంలో సందడి నెలకొంది. ఆయనను చూసేందుకు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆసక్తి చూపించారు. తూప్రాన్ పట్టణానికి చెందిన ప్రముఖ సివిల్ ఇంజనీర్ ప్రతాప ప్రవీణ్ కుమార్ శర్మ, శారద దంపతుల కుమార్తె విజయదుర్గ, ఎల్లారెడ్డిపేటకు చెందిన రాచర్ల ఇందిరారాణి, దయానంద్ శర్మ దంపతుల కుమారుడు శ్రీపాద శర్మల వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ నూతన దంపతుల వద్దకు వెళ్లి వారిని ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కాగా, పెళ్లి కుమారుడు శ్రీపాద శర్మ కేటీఆర్ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తుండటంతో, ఆయన వివాహానికి కేటీఆర్ ప్రత్యేకంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం విశేషంగా నిలిచింది. ప్రముఖ రాజకీయ నాయకుడు స్వయంగా వివాహ వేడుకకు రావడంతో ఇరు కుటుంబాల సభ్యులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజినీ రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి, కౌన్సిలర్లు బొడ్డు రాధా శ్రీనివాస్, జైపాల్ రాథోడ్ నాయక్, సత్యలింగం, ఐలెస్ యాదవ్ పాల్గొన్నారు.
అలాగే బ్రాహ్మణ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు, పురోహితులు సలాక రాజేశ్వర్ శర్మ, శ్రీమతి రాజేశ్వరి, సలాక ఆత్రేయ శర్మ, ఉదయ శర్మ, బిదూర్ రాజేశ్వర శర్మ, సరాఫ్ సతీష్ చారి, బుక్క విజయ్ కుమార్ గుప్త, దాసరి ఆంజనేయులు తదితర ప్రముఖులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.
ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల రాకతో లింగారెడ్డి గార్డెన్స్‌లో వివాహ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

దుబాయ్‌లో ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు



హైదరాబాద్, నవంబర్ 22(మహాప్రభ)
ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సహాయనిధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుబాయ్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న గంగపుత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు తోకల శంకర్ గంగపుత్ర మాట్లాడుతూ గంగపుత్రుల ఐక్యత, ఆత్మగౌరవం, సంప్రదాయ మత్స్యకార వృత్తి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సంఘంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. జాతి హక్కుల సాధనకు వ్యక్తిగత, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బింగి రాజు గంగపుత్ర, ప్రధాన కార్యదర్శి పల్లికొండ గంగనర్సయ్య, కార్యవర్గ సభ్యులు నేన్నెల రాజేష్, పుట్టి రాజు, కొండ్ర నారాయణ, బింగి పోషన్న, ఉట్నూరి రాజనర్సయ్య, ఉట్నూరి కమలాకర్, పందిరి రాజన్న, సభ్యులు కల్లెడ సత్తయ్య, పల్లికొండ తిరుమలేశు, పల్లికొండ సురేష్, నూతికట్ల రమేష్, గుమ్ముల శంకర్, ఆరే వినోద్, గుమ్ముల ప్రణయ్, ఆర్మూర్ గంగాధర్, కుమ్మరి సత్తయ్య, మేడి శంకర్, బొడ్డు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలను విజయవంతం చేసిన సభ్యులకు, గంగపుత్ర సోదరులకు, వివిధ గల్ఫ్ దేశాల నుంచి సహకరించిన వారికి తోకల శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆల మంజుల



దేవరకద్ర: నవంబర్ 22(మహాప్రభ)
ఆత్మీయ పలకరింపులు, ఆప్యాయతల మధ్య దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సతీమణి శ్రీమతి ఆల మంజుల చిన్నరాజమూర్ గ్రామంలో జరిగిన రెండు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం, దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ గ్రామంలో గొల్ల రాములు కుమారుడు మోహన్ కుమార్ యాదవ్ వివాహ వేడుకకు ఆల మంజుల హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన అంకిల్ల లక్ష్మయ్య కుమారుడు భరత్ యాదవ్ వివాహ వేడుకకు కూడా ఆమె హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పెళ్లి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ జెట్టి నరసింహారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ డోకుర్ నరేందర్ రెడ్డి, కొండారెడ్డి, అడ్డు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విష్ణు వల్లభు, అన్వితా దంపతులకు ప్రముఖుల ఆశీస్సులు

హైదరాబాద్, నవంబర్ 22,(మహా ప్రభ)
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు అంగపల్లి సంజీవ ముదిరాజ్, అనుపమ దంపతుల కుమారుడు విష్ణు వల్లభు, అన్వితల వివాహ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, మాజీ రాజ్యసభ సభ్యులు రామచంద్రరావు, మధు యాష్కీ గౌడ్, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్



అధికారి దినేష్ బాబు తదితర ప్రముఖులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కుంబర్తి రవీంద్ర, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్, రిటైర్డ్ సివిల్ సర్జన్ డాక్టర్ విజయలక్ష్మి, టీవీ సీరియల్స్ దర్శకులు పి.రమేష్, విద్యాసాగర్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు, విద్యావంతులు, ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

సృజన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పువ్వాడ అజయ్ కుమార్.

ఖమ్మం టౌన్, నవంబర్ 22,(మహా ప్రభ)
ఖమ్మం నగరంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్ సమీపంలో నూతనంగా నిర్మించిన సృజన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొని, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ అజయ్ కుమారు, పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ సుగుణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఖమ్మం జిల్లాలో అత్యధిక వైద్య సేవలు అందిస్తూ ఎందరో పేద ప్రజల జీవితాలు వెలుగు నింపాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సీనియర్ నాయకులు సొసైటీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, డాక్టర్లు



పీఎన్‌వీఎస్ ప్రసాద్, డాక్టర్ శశాంక, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ జయసూర్య, సృజన్ హాస్పిటల్ యాజమాన్య సభ్యులు, వారి బంధుమిత్రులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

మెదక్ జిల్లా స్థాయి కరాటే బెల్ట్ పరీక్షలు.

మెదక్ జిల్లా -22నవంబర్ (మహాప్రభ).
మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్లో రెంజుకి షోతోకన్ కరాటే వారి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా స్థాయి కరాటే బెల్ట్ ఎక్సమ్ నిర్వహించడం జరిగింది అని కరాటే మాస్టర్ దినకర్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ కరాటే పరీక్ష లకు రెంజు కి షోతోకన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షులు నగేష్ మాస్టర్ ప్రధాన ఎక్సమినార్ గా వ్యవహరించగా విద్యాసాగర్, నాగేంద్ర, లు పర్యవేక్షకులు గా వ్యవహరించారు అని అన్నారు.ఈ బెల్ట్ పరీక్ష ల కు 200 మంది విద్యార్థులు వివిధ మండలల నుండి పాలుగోన్నారన్నారు.ఈ పరీక్ష లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు
ఎల్లో బెల్ట్ విభాగం లో :సతిక్ష, దివ్యానష్
ఆరంజ్ విభాగం లో :లక్ష్మి, సంస్రిత, సాత్విక్, అమృత్ హారన్, వినయ్ సాయి, అర్విక
గ్రీన్ విభాగం లో :,అన్విత ,తేజ,అద్విక సిద్దార్థ్,మాజ్,అక్షయా
బ్లు విభాగం లో :సుప్రీత్, అక్షర, నవదీప్
బ్రౌన్ 4 క్యూ విభాగం లో :శ్రీవల్లి, సాక్షి, సుహార్షిత్, సన్నీ, రన్వీర్ సింగ్, త్రీ జల్ సింగ్, విహాన్, శ్రేయాస్



బ్రౌన్ 3న విభాగం లో :సాన్విక, సహస్ర, చైతన్య శ్రీ, సుస్మశ్రీ, భీంరావ్
బ్లాక్ బెల్ట్ విభాగం లో :అనన్య ,చిన్మాయ్ , మనోజ్ఞ, సాన్విక, యశ్విత,సమ్రీన్, విలసిని, ఈశ్వర్ చంద్ర లు ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు. బెల్ట్ ఎగ్జామ్ లో గెలుపు పొందిన విద్యార్థిని విద్యార్థులకు సీనియర్ కరాటే మాస్టర్ నగేష్ బెల్ట్స్ ప్రధానం చేశారు.వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలకు ఆత్మరక్షణ ఎంతో అవసరం అని అన్నారు.అదేవిధంగా కరాటే నేర్చుకోవడం ద్వారా శరీర క దృఢంతో పాటు మానసికంగా కూడా దృఢంగా ఉంటారని అన్నారు. అదేవిధంగా కరాటే ఎస్ జి ఎఫ్ యూనివర్సిటీ ఒలంపిక్స్ ఏసియన్స్ గేమ్స్ లో కూడా కరాటే ఉన్నదని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్స్, ప్రసన్న, పరశురాం, కూమర్ బ్లాక్ బెల్ట్ విద్యార్థులు, విశిష్ట రాజ్, అఖిల్, విహాన్, తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాను దర్శించుకున్న దేవరకొండ మాజీ శాసనసభ్యులు,

బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ నవంబర్ 22(మహా ప్రభ)
దేవరకొండ మాజీ శాసనసభ్యులు,బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ కుటుంబ సమేతంగా షిరిడీలోని శ్రీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ..... సాయిబాబా కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అదేవిధంగా దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరికీ మంచి జరగాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు.

నాగులపల్లి గోశాలలో ఈ నెల
23న ఉచిత పశువైద్య శిబిరం

-లయన్ డాక్టర్ లింగమూర్తి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం

తూప్రాన్, నవంబర్ 22,(మహాప్రభ)
పశుసంపద సంరక్షణ, గోసేవ లక్ష్యంగా తూప్రాన్, చేగుంట లయన్స్ క్లబ్స్ ట్వినింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు నాగులపల్లి గ్రామంలోని బ్రహ్మంగారి మఠం దేవాలయ గోశాలలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ డాక్టర్ లింగమూర్తి గారి జన్మదినాన్ని పురస్కరించుకొని, వారి సౌజన్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో ముడిపెట్టి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం విశేషం.
ఈ శిబిరానికి పశువైద్య అధికారులు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గోశాలలోని పశువులతో పాటు పరిసర ప్రాంతాల పశుపోషకులు తీసుకువచ్చే పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వాటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించనున్నారు. అవసరమైన వైద్య సలహాలు, చికిత్సలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా



ఉచితంగా పశుగ్రాసం పంపిణీ చేయనున్నారు. పశువులకు వచ్చే వ్యాధుల పట్ల పశుపోషకులకు అవగాహన కల్పించడం, పశుసంపద ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడటం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.
విశిష్ట అతిథుల హాజరు ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ డాక్టర్ లింగమూర్తి, రీజియన్ చైర్మన్ లయన్ జిల్లా రమేష్, జోన్ చైర్మన్ లయన్ గార్డాస్ మనోహర్, లయన్స్ అప్‌డేట్ లయన్ బండారు రామ్ ఫణిధర్ రావు, రీజియన్ సెక్రటరీ లయన్ గుడాల రాధాకృష్ణ, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ నీల ప్రవీణ్ కుమార్ గుప్త, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వంగ భాస్కర్ రెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్, నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త తదితర ప్రముఖులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు.
సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలి
లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజంలోని వివిధ వర్గాలకు ఉపయోగపడేలా కొనసాగుతున్నాయని, పశుసంపద సంరక్షణ కూడా సామాజిక సేవలో ముఖ్యమైన భాగమని నిర్వాహకులు పేర్కొన్నారు. గోశాల అభివృద్ధికి, పశువుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.
ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తూప్రాన్ సభ్యులు, చేగుంట లయన్స్ క్లబ్ సభ్యులు, గోశాల నిర్వాహకులు, పశుపోషకులు, గోసేవాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.
ఆహ్వానించువారు: లయన్ పల్లెర్ల బాలేష్ గుప్త -- సెక్రటరీ జనరల్
లయన్ పచ్చిమట్ల మల్లేష్ గౌడ్ -- ట్రెజరర్
లయన్స్ క్లబ్ ఆఫ్ తూప్రాన్, లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట.

రాష్ట్రస్థాయి అండర్ 14 బాల బాలికల కబడ్డీ పోటీ లో పాల్గొనేందుకు వెళ్లిన మెదక్ ఉమ్మడి జిల్లా జట్టు.



మెదక్ జిల్లా -22నవంబర్ (మహాప్రభ).
ఈ నెల 23-11-2026 నుండి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీలలో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ఆదివారం ఉదయం మెదక్ నుండి బయలుదేరింది. ఈ సందర్భంగా పాఠశాల క్రీడా సమాఖ్య మెదక్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. నాగరాజు మాట్లాడుతూ, ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు తొర్రూరులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు.జిల్లా విద్యాశాఖ అధికారి సహకారంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అవసరమైన కబడ్డీ కిట్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. క్రీడాకారులు ఆదివారం ఉదయం మెదక్ పట్టణంలోని కొత్త బస్టాండ్ నుండి పోటీలలో పాల్గొనేందుకు బయలుదేరినట్లు తెలిపారు.
జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు యస్ జి ఎఫ్ మెదక్ జిల్లా చైర్మన్ మరియు గౌరవ జిల్లా అదనపు కలెక్టర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఆపదలో ఉన్న పేదలకు నేనున్నానంటూ భరోసా





-ఆపన్నహస్తంగా మందడి సరోజ్ రెడ్డి
-మానవత్వమే మిన్నగా..
- కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక అండ।
ఇద్దరు బాధితులకు చెరో రూ.10 వేల సాయం

మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం: నవంబర్ 22 మహాప్రభ
ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు నేనున్నానంటూ భరోసా కల్పించడం నిజమైన నాయకత్వానికి నిదర్శనం. పదవులు, హోదాలకే పరిమితం కాకుండా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు హైకోర్టు న్యాయవాది, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి సరోజ్ రెడ్డి. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తనవంతు సహాయం అందిస్తూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్న ఆయన సేవా దృక్పథం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. అడ్డాకుల మండల కేంద్రానికి



చెందిన బీఆర్ఎస్ నాయకుడు నిరంజన్ గౌరి కుమారుడికి అనారోగ్యంతో మహబూబ్నగర్లోని నవోదయ ఆసుపత్రిలో అపెండిసైటిస్ శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న మందడి సరోజ్ రెడ్డి వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. బాలుడిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల కోసం తనవంతు ఆర్థిక భరోసాగా రూ.10,000 అందజేశారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్ మండలం మదిగట్ల గ్రామానికి చెందిన ఎం.డి. నసీర్ ప్రమాదానికి గురై మహబూబ్నగర్లోని నవోదయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సరోజ్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం వైద్య ఖర్చులకు ఆసరాగా రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. ఒకవైపు ప్రజా జీవితంలో క్రియాశీలకంగా ఉంటూనే, మరోవైపు కష్టాల్లో ఉన్నవారికి వ్యక్తిగతంగా అండగా నిలవడం మందడి సరోజ్ రెడ్డి సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆపదలో ఉన్నవారి కన్నీళ్లు తుడవడమే నిజమైన ప్రజాసేవ అన్న రీతిలో ఆయన అందిస్తున్న సహాయం బాధిత కుటుంబాలకు కొంత ఊరటనిస్తోంది.
రాజకీయాలు ఎన్నికలకే పరిమితం కావు.. ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచినప్పుడే నాయకత్వానికి నిజమైన అర్థం. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయంతో పాటు ఆత్మస్థైర్యాన్ని అందిస్తున్న మందడి సరోజ్ రెడ్డి చొరవ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

వివాహమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జాలేనరసింహారెడ్డి.



దేవరకొండ డివిజన్ నవంబర్ 22 (మహా ప్రభ)
చందంపేట మండలంలోని ఆదివారం.యల్మలమంద గ్రామానికిచెందిన మాజీ ఎంపీటీసీ.శ్రీమతి.కోటి,లక్ష్మణ్ నాయక్,కుమారుడు (సర్దార్,కేశవి)లహైదరాబాద్ లోని మంగళపల్లి ప్రాంతంలో వై ఎస్ ఆర్ కన్వెన్షన్ లో జరిగినవివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన జాలే నరసింహారెడ్డి పిఏ సిఎస్ చైర్మన్.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందునాయక్,యల్మలమంద గ్రామ ప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

- మొదటి రోజు నమోదు ప్రక్రియ విజయవంతం
-తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో మొదటి రోజు 207 దరఖాస్తులు నమోదు

తూప్రాన్ నవంబర్ 22,(మహాప్రభ)
తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియ మొదటి రోజు విజయవంతంగా ప్రారంభమైంది. మొదటి విడతలో భాగంగా 10వ, 11వ, 12వ, 14వ మరియు 16వ వార్డులలో



దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మొదటి రోజు ముగింపు సమయానికి మొత్తం 207 దరఖాస్తులు విజయవంతంగా నమోదు చేయడం జరిగింది. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు. మిగిలిన వార్డులలో కూడా నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.రమేష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బోనం రాకేష్ అన్న స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు



హైదరాబాద్ నవంబర్ 22,(మహాప్రభ)
హైదరాబాదులో బోనం రాకేష్ అన్న స్వామి జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని అభిమానులు పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి గజమాలతో శాలువాతో సన్మానించి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ఆయన మాట్లాడుతూ నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అన్నలు తమ్ముళ్లు బంధువులు నా అభిమానులు నా శిష్యులు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వెలుగుల ఉదయంచూడాలి... మంజుల పత్తిపాటి.

భువనగిరి నవంబర్ 22,(మహాప్రభ)

వెలుగుల ఉదయాన్ని చూడాలని నిద్ర పట్టక
రేయిలో జారిన సిరాచుక్క చెప్తోంది...
ఇసుక గూళ్లు కట్టుకున్నే వయసులో
ఇటుకల తట్టలు ఇంకా ఎన్ని రోజులు
మోయలని..?

వెలుగుల ఉదయాన్ని చూడాలని నిద్ర పట్టక
రేయిలో జారిన సిరాచుక్క చెప్తోంది...
ఆకలి పేగులు మెలిపెడుతుంటే
కనుపాపలకు కునుకు ఎలా వస్తుంది అని..?

కరెంటు కోతలతో వేడెక్కిన స్టాటరులతో మోటార్లు
చనిపోతుంటే...
నీళ్లు లేక పాలాలు ఎండిపోతుంటే...
రైతన్నల చిరునవ్వుల హారాలు తెగిపోయి
కుటుంబాలకు దూరం అవుతున్నారు అని
రేయిలో జారిన సిరాచుక్క ఆవేదన చెందుతోంది..!

రంగుల ప్రపంచంలో ప్లాస్టిక్ జీవితం ఎప్పుడు అంతం అవుతుంది అని నా
కలం ఆడుగుతోంది..!

గాలికి కొట్టుకుపోయే బతుకులకు
వరదల జల్లు కాదు..
కన్నీటిని తుడిచే చినుకులు కావాలని
నా కలం కోరుకుంటోంది..!

స్టేటస్‌ల సముద్రంలో మునిగిపోయిన మనసులకు
ఆప్యాయతల అలలు తాకాలని
నా కలం కోరుకుంటోంది..!

రచన: మంజుల పత్తిపాటి
చరవాణి 9347042218
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదాద్రి భువనగిరి
జిల్లా తెలంగాణ రాష్ట్రం.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం....



శివంపేట నవంబర్ 22 (మహాప్రభ)

శివంపేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత పథకాన్ని గ్రామ సర్పంచ్ రాజపేట వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో రేషన్ కార్డు ఉన్నవారు ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని అందరూ కూడా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేష్, కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో రేషన్ కార్డు ఉన్నవారు ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని అందరూ కూడా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేష్, కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాటలకే పరిమితం కాని నాయకత్వం.. అభివృద్ధి బాటలో దేవరకద్ర

-నియోజకవర్గ రూపురేఖలు మార్చే దిశగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అడుగులు..

- అభివృద్ధికి కొత్త చిరునామాగా దేవరకద్ర



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 22 మహాప్రభ

ఒక నియోజకవర్గ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు వేయడం.. భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. ప్రజల అవసరాలను గుర్తించడం, ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు పరిష్కారం చూపడం, భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించడం. ప్రజల ఆకాంక్షలను అభివృద్ధి ప్రణాళికలుగా మార్చి, వాటిని కార్యరూపంలోకి తీసుకెళ్లే నాయకత్వమే నిజమైన ప్రజాప్రతినిధి నాయకత్వం. దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు ఈ దిశగానే సాగుతున్నాయి. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నియోజకవర్గానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, రహదారులు, సాగునీరు, ఉపాధి, సంక్షేమం వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ పెద్దలతో సమన్వయం చేసుకోవడం, నిధులు సాధించడం, అధికారులతో సమీక్షలు నిర్వహించడం ద్వారా దేవరకద్రను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రయత్నిస్తున్నారు.

వైద్య రంగంలో చారిత్రాత్మక ముందడుగు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలంటే పెద్ద ఆసుపత్రులు అందుబాటులోకి రావాలి. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి మారాలి. ఈ లక్ష్యంతో దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అడుగులు పడటం నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రాధాన్యమైన పరిణామం.

అదేవిధంగా కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటుపైనా దృష్టి సారించారు. ఈ ఆసుపత్రులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వేలాది కుటుంబాలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుంది.

విద్యకు పెద్దపీట.. యువత భవిష్యత్తుకు భరోసా

ఒక ప్రాంత భవిష్యత్తును మార్చగలిగేది విద్య మాత్రమే. ఈ విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి దేవరకద్రలో డిగ్రీ కళాశాల, చిన్నచింతకుంటలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గించడం, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యను చేరువ చేయడం ఈ ప్రయత్నాల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం.

విద్యా సంస్థలతోపాటు చిన్నచింతకుంట ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఏటీసీ కేంద్రం వంటి విద్యా, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపైనా దృష్టి సారించడం విశేషం.

బ్రహ్మోస్ ప్రాజెక్టుతో దేవరకద్రకు పారిశ్రామిక గుర్తింపు!

దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిలో అత్యంత కీలకమైన అంశంగా బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ ప్రతిపాదన నిలుస్తోంది.

రక్షణ రంగానికి చెందిన ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ తయారీ యూనిట్ దేవరకద్రకు రావడానికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ ప్రాజెక్టు కోసం 416 ఎకరాల భూమి కేటాయింపు ప్రక్రియ పూర్తయినట్లు ఆయన ప్రకటించారు.

ఈ పరిశ్రమ కార్యరూపం దాల్చితే దేవరకద్రకు పారిశ్రామికంగా కొత్త గుర్తింపు లభించడమే కాకుండా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అనుబంధ పరిశ్రమలు, వ్యాపారాలు, రవాణా, వాణిజ్య రంగాలు కూడా అభివృద్ధి చెందేందుకు మార్గం సుగమమవుతుంది.

ఒక నియోజకవర్గాన్ని వ్యవసాయ ఆధారిత ప్రాంతం నుంచి పారిశ్రామిక అవకాశాలున్న ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనలో ఈ ప్రాజెక్టు ప్రాధాన్యత ప్రత్యేకమైనది.

రహదారులు, వంతెనలు.. ప్రజల ప్రయాణ కష్టాలకు పరిష్కారం

అభివృద్ధికి రహదారులే ప్రధాన ఆధారం. గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావాలి. రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడాలి.

ఈ దిశగా మినీగొనిపల్లి నుంచి కురుమూర్తి వరకు సుమారు రూ.134 కోట్లతో డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరగడం, ముచ్చింతల నుంచి పరిధిపూర్ వరకు సుమారు రూ.40 కోట్లతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం నియోజకవర్గ రవాణా వ్యవస్థకు కీలకమైన ముందడుగులు.

మదనపురం--ఆత్మకూరు మధ్య రూ.6 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తికావడం, శంకరపేట--దంతనూరు ప్రాంతంలో రూ.కోటి వ్యయంతో మరో వంతెన నిర్మాణం కూడా ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనలో భాగంగా నిలిచాయి.

దేవరకద్ర పట్టణంలో రైల్వే మార్గం వల్ల ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా సబ్‌వే ఏర్పాటుకు కూడా కృషి చేయడం గమనార్హం.

రైతాంగానికి అండగా.. సాగునీటి వనరుల బలోపేతం

దేవరకద్ర ప్రాంతంలో రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై కూడా ఎమ్మెల్యే దృష్టి సారించారు. మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మరమ్మతులకు సుమారు రూ.5 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు ప్రకటించారు.

సాగునీటి వనరులు మెరుగుపడితే రైతులకు సాగు భరోసా కలుగుతుంది. పంటల ఉత్పత్తి పెరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. రైతు కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం పెరుగుతుంది.

సంక్షేమ పథకాలు.. పేద కుటుంబాలకు అండ

అభివృద్ధి ఫలాలు కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా పేద కుటుంబాలకు కూడా చేరాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

నియోజకవర్గంలో సుమారు 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే సుమారు 28 వేల రేషన్ కార్డులు మంజూరైనట్లు ఆయన ప్రకటించారు.

పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం కావడం, అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులోకి రావడం సామాజిక భద్రతకు దోహదపడే అంశాలు.

దేవరకద్రకు మున్సిపాలిటీ హోదా.. పట్టణ అభివృద్ధికి కొత్త దిశ

దేవరకద్ర పట్టణానికి మున్సిపాలిటీ హోదా రావడం స్థానిక అభివృద్ధిలో మరో కీలక పరిణామం. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక నిధులతో పనులు చేపడుతున్నారు.

భూత్పూర్ మున్సిపాలిటీలో కూడా రూ.20 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్షలు నిర్వహిస్తూ, పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తున్నారు.

అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్న దృక్పథం ఈ సమీక్షల్లో కనిపిస్తోంది.

ఆధ్యాత్మిక, పర్యాటక రంగానికీ ప్రోత్సాహం

దేవరకద్ర నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన కురుమూర్తి స్వామి దేవస్థానం అభివృద్ధిపైనా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

కురుమూర్తి దేవస్థానంలో సుమారు రూ.75 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో రూ.50 లక్షలతో గాలిగోపురం, దాసంగాల షెడ్లు, రూ.25 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టి ప్రారంభించడం ఆలయ అభివృద్ధికి దోహదపడింది.

ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కలగడంతోపాటు స్థానికంగా వ్యాపార, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

అధికారులతో సమన్వయం.. అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ

ఎమ్మెల్యే పదవి అంటే కేవలం ప్రజా కార్యక్రమాలకు హాజరు కావడం కాదు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సాధించడం, మంజూరైన నిధులతో పనులు పూర్తయ్యేలా చూడటం కూడా అంతే ముఖ్యం. ఈ దిశగా జి. మధుసూదన్ రెడ్డి అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తూ అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకుంటున్నారు. దేవరకద్రలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి భూమి కేటాయింపు, స్టేడియం ఏర్పాటుకు అదనపు భూమి, చిన్నచింతకుంట జూనియర్ కళాశాల భవనం, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం ఆయన అభివృద్ధి ప్రణాళికలో భాగం.

నాయకత్వానికి అసలైన కొలమానం.. ప్రజల జీవితాల్లో మార్పు!

ఒక నాయకుడి పనితీరును అంచనా వేయాలంటే ఆయన మాట్లాడిన మాటలకంటే, ప్రజల కోసం సాధించిన ఫలితాలను పరిశీలించాలి. ఒక ఆసుపత్రి నిర్మాణం వెనుక వేలాది కుటుంబాల ఆరోగ్య భద్రత ఉంటుంది. ఒక కళాశాల వెనుక వందలాది విద్యార్థుల భవిష్యత్తు ఉంటుంది. ఒక వంతెన వెనుక ఎన్నో గ్రామాల రాకపోకల సౌలభ్యం ఉంటుంది. ఒక పరిశ్రమ వెనుక యువతకు ఉపాధి కల్పించే అవకాశాలు ఉంటాయి.

ఈ నేపథ్యంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి ప్రయత్నాలను సమగ్రంగా పరిశీలిస్తే.. నియోజకవర్గానికి అవసరమైన మౌలిక వసతులు, విద్య, వైద్యం, పారిశ్రామిక ప్రగతి, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు ఒకేసారి ప్రాధాన్యత ఇచ్చే ప్రయత్నం కనిపిస్తోంది.

అయితే మంజూరైన పనులు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, పూర్తయిన అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ ప్రజలకు స్పష్టంగా చేరాలి. ప్రతి పనిలో నాణ్యత, పారదర్శకత, సమయపాలన ఉండాలి. అప్పుడే ఈ ప్రయత్నాలకు సంపూర్ణ సార్థకత చేకూరుతుంది.

దేవరకద్ర అభివృద్ధి అనేది ఒక్కరోజులో పూర్తయ్యే ప్రయాణం కాదు. అది నిరంతర కృషి, పట్టుదల, సమన్వయం, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాల్సిన ప్రస్థానం. ఆ ప్రస్థానంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తనదైన ముద్ర వేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరి, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరిసి, దేవరకద్ర నియోజకవర్గం అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలవాలని ఆశిద్దాం. అభివృద్ధి ఒక ప్రకటనలో కనిపించేది కాదు.. ప్రజల జీవితాల్లో కనిపించాలి. దేవరకద్ర భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే దిశగా సాగుతున్న ప్రతి మంచి ప్రయత్నం ప్రజల మన్ననలు పొందాలి.

ఆర్థిక సహాయం అంధజేత

-బిఆర్ఎస్ పార్టీ మండల ప్రచారకార్యదర్శి బుద్దుల బిక్షపతి



శివ్వంపేట నవంబర్ 22(మహాప్రభ)

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతి గ్రామపంచాయతీ కార్మికులుగా గ్రామానికి ఎంతో సేవలందించిన బొడ్డు నాగరాజు చనిపోవడం చాలా బాధాకరం అతని పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ న వంతు సహాయం గా బి ఆర్ ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి బొద్దులు బిక్షపతి రూ 3000 రూపాయలు నాగరాజు భార్యకు కవితకు ఆర్థిక సాయం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బస్తీ ప్రజలు పుల్లగారి శేఖర్ పాలట మహేష్ సదానందం పాల్గొన్నారు.

కార్తీక దీపాల వెలుగుల్లో విరాజిల్లిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం!



శివ్వంపేట, నవంబర్ 22 (మహాప్రభ):

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ శివారులో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు ధనుంజయ శర్మ స్వామివారికి ప్రత్యేక దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పుష్పమాలలతో, వేలాది దీపాల వెలుగులతో సుందరంగా అలంకరించారు. దీపాల కాంతులతో స్వామివారి సన్నిధి భక్తి పారవశ్యాన్ని నింపగా, పూలమాలలతో అలంకరించిన స్వామివారి దర్శనం కనులపండువగా నిలిచింది. కార్తీక మాసం పవిత్రతను చాటుతూ ఆలయంలో వెలిగించిన దీపాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ ప్రత్యేక అలంకరణతో ఆలయ పరిసరాలు భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు ఆనందం, ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. కార్తీక మాసంలో స్వామివారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని ఆలయ భక్తులు విశ్వసిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల మధ్య చెత్తాచెదారం.. పట్టించుకోని అధికారులు!





శివ్వంపేట, నవంబర్ 22 (మహాప్రభ):

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల మధ్య పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. కార్యాలయాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో ఎండిన ఆకులు, చెట్ల కొమ్మలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాల మధ్యే ఇలాంటి దుస్థితి నెలకొనడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలే ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు, ఇతర క్రిమికీటకాలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బిజినెస్

ఏథర్ దూకుడు.. ఈవీ మార్కెట్‌లో జోరు!

- అక్టోబర్‌లో 33,786 స్కూటర్ల విక్రయం
- గత ఏడాదితో పోలిస్తే 30.8 శాతం వృద్ధి
- కోనార్క్ అమ్మకాల్లో ఒక్క నెలలోనే 83 శాతం పెరుగుదల
- రూ.99,999 ప్రారంభ ధరతో మార్కెట్‌లోకి కొత్త స్కూటర్
- 200 కిలోమీటర్ల ప్రయాణ సామర్థ్యం.. ఆధునిక సౌకర్యాలు



భారత విద్యుత్ వాహనాల మార్కెట్‌లో ఏథర్ ఎనర్జీ తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. వినియోగదారుల నుంచి పెరుగుతున్న ఆదరణతో అమ్మకాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తోంది. 2026 అక్టోబర్‌లో కంపెనీ మొత్తం 33,786 విద్యుత్ స్కూటర్లను విక్రయించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమ్మకాలు 30.8 శాతం పెరిగాయి. ముఖ్యంగా ఆగస్టు చివరిలో మార్కెట్‌లోకి తీసుకొచ్చిన ఏథర్ కోనార్క్ స్కూటర్ విక్రయాలు కంపెనీ వృద్ధికి దోహదపడుతున్నాయి. అక్టోబర్‌లో ఈ మోడల్ 7,562 యూనిట్లు అమ్ముడవగా, అంతకుముందు నెలతో పోలిస్తే 83 శాతం వృద్ధి నమోదైంది. కంపెనీ ప్రత్యేకంగా రూపొందించిన ఈఎల్ వేదికపై ఈ స్కూటర్‌ను అభివృద్ధి చేశారు. రూ.99,999 ప్రారంభ ధరతో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 200 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం, ఏడు అంగుళాల టీఎఫ్‌టీ తెర, పలు ఆధునిక అనుసంధాన సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. తక్కువ ధరలో అధునాతన సాంకేతికత, మెరుగైన ప్రయాణ సామర్థ్యం కోరుకునే వినియోగదారులను ఈ స్కూటర్ ఆకర్షిస్తోంది. మొత్తంగా కోనార్క్‌కు లభిస్తున్న ఆదరణ ఏథర్ ఎనర్జీ మార్కెట్ విస్తరణకు మరింత బలాన్నిస్తోంది.

మరింత తగ్గనున్న పసిడి ధరలు!

- వచ్చే వారంలోనూ తగ్గుదల కొనసాగే అవకాశం
- 10 గ్రాముల ధర రూ.1.17 లక్షలకు పడిపోవచ్చని అంచనా
- ఈ వారంలోనే 9 శాతం క్షీణించిన అంతర్జాతీయ ధర
- అమెరికా ఆర్థిక నివేదికలపై మార్కెట్ దృష్టి



బంగారం ధరలు మరింత దిగివచ్చే అవకాశం ఉందని ఆర్థిక సేవల సంస్థ ఛాయిస్ ఇండియా అంచనా వేసింది. ఇప్పటికే పసిడి ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టగా.. వచ్చే వారంలోనూ ఇదే ధోరణి కొనసాగవచ్చని విశ్లేషించింది. ఈ వారంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 9 శాతం మేర తగ్గి 3,540 డాలర్లకు చేరినట్లు పేర్కొంది. ఈ ప్రభావంతో దేశీయ మార్కెట్‌లోనూ ధరలు దిగివచ్చే అవకాశముందని తెలిపింది. పది గ్రాముల బంగారం ధర ప్రస్తుతం ఉన్న స్థాయిల నుంచి తగ్గితే రూ.1,19,000 నుంచి రూ.1,17,628కు చేరవచ్చని అంచనా వేసింది. అయితే అంతర్జాతీయ పరిణామాలు అనుకూలిస్తే ధరలు మళ్లీ పుంజుకునే అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేదు. ఈ పరిస్థితిలో పది గ్రాముల ధర రూ.1,23,750 నుంచి రూ.1,27,000 స్థాయికి చేరవచ్చని వెల్లడించింది. వచ్చే వారం విడుదల కానున్న అమెరికా ఆర్థిక గణాంకాలు, నివేదికలు బంగారం ధరల తదుపరి కదలికలను నిర్దేశించనున్నాయని విశ్లేషించింది. దీంతో అంతర్జాతీయ పరిణామాలపై పసిడి మార్కెట్ వర్గాలు దృష్టి సారించాయి.

రెండు పాన్ కార్డులున్నాయా?..రూ.10 వేల జరిమానా!

- ఒక వ్యక్తికి ఒకే పాన్ కార్డు ఉండాలన్న నిబంధన
- రెండో కార్డు ఉన్నట్లు తేలితే రూ.10 వేల వరకు జరిమానా
- గుజరాత్ వ్యాపారికి రూ.7.60 లక్షల అదనపు పన్ను నోటీసులు
- ఆదాయం దాచినట్లు భావించలేమన్న ట్రిబ్యునల్
- అదనపు పాన్ కార్డును వెంటనే సరెండర్ చేయాలి



ఒక వ్యక్తి రెండు పాన్ కార్డులు కలిగి ఉండటం ఆదాయపు పన్ను చట్టం ప్రకారం నిబంధనల ఉల్లంఘనే. ప్రతి వ్యక్తికి ఒకే శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) ఉండాలి. ఒకటి కంటే ఎక్కువ కార్డులు కలిగి ఉన్నట్లు గుర్తిస్తే ఆదాయపు పన్ను శాఖ రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఇటీవల గుజరాత్‌కు చెందిన ఓ వ్యాపారికి రెండు పాన్ కార్డుల వ్యవహారంలో రూ.7.60 లక్షల అదనపు పన్ను చెల్లించాలంటూ నోటీసులు అందడం ఈ అంశంపై చర్చకు దారితీసింది. అయితే ఒక వ్యక్తికి రెండు పాన్ కార్డులు ఉన్నంత మాత్రాన ఆయన ఆదాయాన్ని దాచినట్లు నిర్ధారించలేమని ట్రిబ్యునల్ పేర్కొంది. రెండు కార్డులు ఉన్నాయనే కారణంతోనే ఆదాయ అక్రమాలకు పాల్పడినట్లు భావించకూడదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఒకటి కంటే ఎక్కువ పాన్ కార్డులు ఉన్నవారు అదనపు కార్డును వెంటనే ఆదాయపు పన్ను శాఖకు సరెండర్ చేయాలి. భవిష్యత్తులో పన్ను సంబంధిత ఇబ్బందులు, జరిమానాలను నివారించేందుకు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

స్పోర్ట్స్

వరుసగా 4 బంతుల్లో 4 వికెట్లు..

- అరంగేట్రంలోనే అదరగొట్టిన యువ పేసర్ జంషెడ్ ఆలం!
- సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సంచలనం
- టీ20 అరంగేట్రంలోనే నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన జంషెడ్ ఆలమ్
- ఈ ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా రికార్డు
- సౌరాష్ట్రపై 9 బంతుల్లోనే 5 వికెట్లు పడగొట్టిన యువ పేసర్
- ఆలమ్ దెబ్బకు 29 పరుగుల తేడాతో ఓడిన సౌరాష్ట్ర



సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ఓ యువ బౌలర్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే అద్భుతం చేశాడు. రైల్వేస్ జట్టుకు చెందిన 23 ఏళ్ల రైట్ ఆర్మ్ మీడియం పేసర్ జంషెడ్ ఆలమ్, వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించాడు. ఈ ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా అతను రికార్డుల్లోకి ఎక్కాడు. ఇండోర్ వేదికగా సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఫీట్ నమోదైంది. తొలుత బ్యాటింగ్ చేసిన రైల్వేస్ జట్టు 5 వికెట్లకు 182 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సౌరాష్ట్ర ఇన్నింగ్స్‌లో నాలుగో ఓవర్ వేసిన జంషెడ్ ఆలమ్, తన మ్యాజిక్‌ను ప్రదర్శించాడు. ఆ ఓవర్‌లోని వరుస బంతుల్లో హార్విక్ దేశాయ్, ప్రేరక్ మన్కడ్, రుచిత్ అహిర్, సమ్మర్ గజ్జర్‌లను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత తన తర్వాతి ఓవర్‌లో సిద్ధార్థ్ రానా వికెట్‌ను కూడా తీసి, కేవలం 9 బంతుల్లోనే 5 వికెట్ల ప్రదర్శన పూర్తి చేశాడు. దీంతో సౌరాష్ట్ర 30 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. టీ20ల్లో నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన భారత బౌలర్లలో ఆలమ్ మూడోవాడు. గతంలో కర్ణాటకకు చెందిన అభిమన్యు మిథున్ (2019), విదర్భ బౌలర్ దర్శన్ నల్కండే (2021) ఈ ఘనత సాధించారు. అయితే, వాళ్లిద్దరూ ఇన్నింగ్స్ 20వ ఓవర్‌లో ఈ ఫీట్ సాధించగా, ఆలమ్ మ్యాచ్ ఆరంభంలోనే ఈ రికార్డు నెలకొల్పడం విశేషం. అంతేకాకుండా టీ20 అరంగేట్రంలో ఐదు వికెట్లు తీసిన ఆరో భారత బౌలర్‌గా కూడా ఆలమ్ నిలిచాడు. ఈ మ్యాచ్‌లో ఆలమ్ మొత్తం 38 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అతని ధాటికి సౌరాష్ట్ర 8 వికెట్లకు 153 పరుగులు మాత్రమే చేసి, 29 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

టెస్ట్ క్రికెట్ చరిత్రలో అరుదైన ఫీట్.. తొలి జట్టుగా భారత్ ఘనత

- న్యూజిలాండ్‌తో టెస్టులో భారత్ 720/9 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్
- టెస్ట్ ఇన్నింగ్స్‌లో తొలి ఏడు వికెట్లకు 50+ భాగస్వామ్యాలు నెలకొల్పిన తొలి జట్టుగా రికార్డు
- కేఎల్ రాహుల్ (136), రిషబ్ పంత్ (128) అద్భుత సెంచరీలు
- న్యూజిలాండ్ గడ్డపై అత్యధిక టెస్ట్ స్కోరు నమోదు చేసిన టీమిండియా
- కివీస్‌పై ఏ టెస్ట్ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు కావడం మరో విశేషం



వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టు పరుగుల వరద పారించి సరికొత్త చరిత్ర సృష్టించింది. రికార్డుల మోత మోగించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 720/9 పరుగుల భారీ స్కోరు వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి, 352 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. ఈ క్రమంలో టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఓ అరుదైన ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకుంది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌట్ కాగా, బదులుగా బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు ఆది నుంచే అద్భుత భాగస్వామ్యాలు లభించాయి. ఓపెనర్లు కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ తొలి వికెట్‌కు 130 పరుగులు జోడించారు. జైస్వాల్ (85) ఔటయ్యాక, రాహుల్ (136) దేవదత్ పడిక్కల్ (80)తో కలిసి రెండో వికెట్‌కు 165 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి రాహుల్ మూడో వికెట్‌కు 91 పరుగులు జోడించాడు. పునరాగమనంలో అదరగొట్టిన రిషబ్ పంత్ (128) సెంచరీతో కదం తొక్కాడు. గిల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు శతక భాగస్వామ్యం నమోదు చేసిన పంత్, ఆ తర్వాత నైట్‌వాచ్‌మన్ అన్షుల్ కంబోజ్‌తో ఐదో వికెట్‌కు 75 పరుగులు, ధ్రువ్ జురెల్‌తో ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. ఆపై జురెల్, వాషింగ్టన్ సుందర్ కలిసి ఏడో వికెట్‌కు మరో 54 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఫలితంగా, ఒకే టెస్ట్ ఇన్నింగ్స్‌లో తొలి ఏడు వికెట్లకు 50కి పైగా పరుగుల భాగస్వామ్యాలు నమోదు చేసిన తొలి జట్టుగా భారత్ ప్రపంచ రికార్డు సృష్టించింది. భారత్ చేసిన 720 పరుగులు న్యూజిలాండ్‌పై టెస్టుల్లో ఏ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. 1995లో ఇదే మైదానంలో వెస్టిండీస్ నెలకొల్పిన 660/5 పరుగుల రికార్డును భారత్ బద్దలు కొట్టింది. అలాగే, న్యూజిలాండ్ గడ్డపై ఇదే అత్యధిక టెస్ట్ ఇన్నింగ్స్ స్కోరు. 2019లో బంగ్లాదేశ్‌పై న్యూజిలాండ్ చేసిన 715/6 పరుగుల రికార్డును భారత్ అధిగమించింది. ఈ భారీ స్కోరుతో టీమిండియా ఈ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించి విజయం దిశగా అడుగులు వేస్తోంది.

వెల్లింగ్టన్ టెస్టులో పట్టు బిగించిన భారత్..

- ఓటమి నుంచి గట్టెక్కేందుకు కివీస్ పోరాటం
- వెల్లింగ్టన్ టెస్టులో నాలుగో రోజు ఆట ముగిసేసరికి కివీస్ 119/2
- భారత్ కంటే ఇంకా 233 పరుగుల వెనుకంజలో న్యూజిలాండ్
- క్రీజులో డెవాన్ కాన్వే (59), రచిన్ రవీంద్ర (27)
- తొలి ఇన్నింగ్స్‌లో 720/9 వద్ద డిక్లేర్ చేసిన భారత్



భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ జట్టు ఓటమి నుంచి గట్టెక్కేందుకు పోరాడుతోంది. వెల్లింగ్టన్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (59 బ్యాటింగ్), రచిన్ రవీంద్ర (27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు న్యూజిలాండ్ ఇంకా 233 పరుగులు వెనుకంజలో ఉంది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే కెప్టెన్ టామ్ లాథమ్‌ను జస్‌ప్రీత్ బుమ్రా పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత హెన్రీ నికోల్స్ (31) నిలకడగా ఆడుతున్న సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో ధ్రువ్ జురెల్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. ఈ దశలో కాన్వే హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు.అంతకుముందు, భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 720/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. న్యూజిలాండ్ గడ్డపై ఇదే అత్యధిక టెస్ట్ స్కోరు కావడం విశేషం. రిషభ్ పంత్ (128) అద్భుత సెంచరీతో చెలరేగాడు. దీంతో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల్లో సెంచరీ చేసిన ఆరో భారత బ్యాటర్‌గా పంత్ రికార్డు సృష్టించాడు. మ్యాచ్ గెలవాలంటే చివరి రోజు భారత్ 8 వికెట్లు తీయాల్సి ఉండగా, కివీస్ టెస్టును డ్రా చేసుకునేందుకు తీవ్రంగా శ్రమించాల్సి ఉంది.

ఆకట్టుకుంటున్న 'ది లక్ష్మణ' ఫస్ట్ లుక్ పోస్టర్!



భారతీయ సినీ రంగంలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. రామాయణ మహాకావ్యంలో శ్రీరాముడికి అండగా నిలిచి, ఎన్నో సాహసాలు చేసిన మహా యోధుడు లక్ష్మణుడి జీవితంలోని వెలుగులోకి రాని విశేషాలను వెండితెరపై ఆవిష్కరించేందుకు 'ది లక్ష్మణ -- అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో ఓ భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించి, భారతదేశంలోనే తొలి ఫోటోరియలిస్టిక్ ఏఐ చిత్రంగా ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. సరికొత్త కథనం, అద్భుతమైన విజువల్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ చలనచిత్ర నిర్మాణ రంగంలో ఓ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టనుంది.రామాయణంలో లక్ష్మణుడి పాత్రకున్న ప్రాధాన్యత, ఆయన చేసిన సాహసాలు, త్యాగాలు, అసాధారణ వీరత్వాన్ని ఇప్పటివరకు ఎవరూ చూడని సరికొత్త కోణంలో ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు. శ్రీమతి మాతా రాజేశ్వరి సమర్పణలో భూమాత ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి పి. రాధాకృష్ణ కథను అందించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. పవన్ మాతా, నితిన్ మాతా నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, బియాండ్ ఎక్స్ స్టూడియో (దీవఎశీలఽ శ్రీబఽఅశీ), నాపా డాట్ ఎస్ఐ సంస్థలు ఏఐ సాంకేతిక నిర్మాణ బాధ్యతలను చూసుకుంటున్నాయి. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ తన ఎక్స్ (శ) ఖాతా ద్వారా డిజిటల్‌గా విడుదల చేయగా, మల్కాజిగిరి ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ భౌతికంగా ఆవిష్కరించారు. విడుదలైన పోస్టర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువయ్యేలా తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ, కన్నడ, తమిళం, మలయాళం భాషల్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఒక గొప్ప యోధుడి అజ్ఞాత వీరగాథను అత్యాధునిక ఏఐ సాంకేతికతతో ప్రపంచానికి పరిచయం చేయనున్న 'ది లక్ష్మణ -- అన్‌టోల్డ్ స్టోరీ' పై ఇప్పుడు సినీ ప్రేక్షకుల్లో, ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది.

మహేష్ బాబు సినిమాలో విలన్‌గా నటించడానికైనా రెడీ..

అనుపమ పరమేశ్వరన్ కామెంట్స్ వైరల్!



మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో హీరోయిన్‌గా పరిచయమైన అనుపమ పరమేశ్వరన్.. ఆ తర్వాత తెలుగు సినిమాల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సహజమైన నటన, అందమైన చిరునవ్వు, చలాకీ తనంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ కేరళ కుట్టి ప్రస్తుతం విభిన్నమైన కథలు, పాత్రలతో తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. తాజాగా టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు గురించి అనుపమ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేష్ బాబు సినిమాలో హీరోయిన్‌గా మాత్రమే కాకుండా విలన్‌గా నటించే అవకాశం వచ్చినా తాను సిద్ధమేనని ఆమె చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ పరమేశ్వరన్‌ను పలువురు హీరోల గురించి ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మహేష్ బాబును ఒక్క మాటలో వర్ణించమని యాంకర్ అడగగా.. ఆయన చాలా హ్యాండ్సమ్ అని ఏమాత్రం ఆలోచించకుండా సమాధానమిచ్చారు. మహేష్ బాబు అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయన అందం తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని అనుపమ చెప్పుకొచ్చారు. అంతేకాకుండా భవిష్యత్తులో మహేష్ బాబు సినిమాలో నటించే అవకాశం వస్తే పాత్ర విషయంలో ఎలాంటి పరిమితులు పెట్టుకోనని వెల్లడించారు. హీరోయిన్‌గా అవకాశం వచ్చినా, విలన్‌గా నటించే ఛాన్స్ వచ్చినా వెంటనే అంగీకరిస్తానని తన మనసులోని మాటను బయటపెట్టారు. దీంతో మహేష్ అభిమానులు, అనుపమ అభిమానులు ఈ వ్యాఖ్యలపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. మహేష్ బాబుకు విలన్‌గా నటిస్తే ఎదురయ్యే సరదా ఇబ్బందిని కూడా అనుపమ వివరించారు. సినిమాలో సన్నివేశం ప్రకారం మహేష్ బాబును కోపంగా, కసిగా చూడాల్సి ఉంటుందని.. కానీ ఆయన అందం ముందు అలా నటించడం తనకు కష్టమవుతుందేమోనని నవ్వుతూ చెప్పారు. మహేష్ బాబు సినిమాలో విలన్‌గా నటించే అవకాశం వస్తే, ఆయన వైపు కోపంగా చూడాల్సిన సన్నివేశాల్లో కూడా రొమాంటిక్‌గా చూస్తూ ఉండిపోతానేమో. ఆయన ఎదురుగా నిలబడితే డైలాగులు కూడా మర్చిపోతానేమో" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె చెప్పిన ఈ మాటలు అభిమానులకు నవ్వులు పూయించడంతో పాటు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.



టాలీవుడ్ నాకు ఎన్నో నేర్పింది..

సినిమా ఇండస్ట్రీలో అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న హీరోయిన్లు చాలామందే ఉన్నారు. అయితే ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా, ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేయాలని కోరుకునే నటీమణులు మాత్రం కొద్దిమందే ఉంటారు. అలాంటి వారిలో రకుల్ ప్రీత్ సింగ్ ఒకరు. కెరీర్ ప్రారంభం నుంచి గ్లామర్ పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు పౌరాణిక పాత్రతో మరోసారి వార్తల్లో నిలుస్తుంది. భారీ బడ్జెట్‌తో రూపొందిన రామాయణం సినిమాలో శూర్పణఖ పాత్రలో కనిపించి మెప్పించింది. ఈ క్రమంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విభిన్నమైన పాత్రలు కనిపిస్తాయి. ముఖ్యంగా తెలుగు సినిమాల్లో గ్లామరస్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు సంపాదించుకుంది. అయితే ప్రస్తుతం తనకు అలవాటైన ఇమేజ్‌ను పక్కనపెట్టి, నటిగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రయత్నిస్తుంది. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక 'రామాయణం' చిత్రంలో రకుల్ శూర్పణఖ పాత్రను పోషించింది. సాధారణ హీరోయిన్ పాత్రలకు భిన్నంగా ఉండే ఈ క్యారెక్టర్ ఆమె కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచింది. పౌరాణిక నేపథ్యం ఉన్న పాత్రలో ఆమె ఎలా కనిపిస్తారన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.తాజాగా తన కెరీర్ గురించి మాట్లాడిన రకుల్ తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రత్యేక అభిమానాన్ని చాటుకుంది. నటిగా తనకు గుర్తింపు రావడానికి టాలీవుడ్ ఎంతో సహాయపడిందని తెలిపింది. తనలోని నటనా సామర్థ్యాన్ని వెలికితీసి, ఎన్నో అవకాశాలు కల్పించిన ఘనత తెలుగు పరిశ్రమకే దక్కుతుందని పేర్కొంది. జాతీయ స్థాయిలో సినిమాలు చేస్తున్నప్పటికీ తెలుగు చిత్ర పరిశ్రమతో తనకున్న అనుబంధాన్ని రకుల్ మర్చిపోలేదు. టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవం తనకు ఎంతో నేర్పిందని, కెరీర్‌లో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా చేసిందని చెప్పుకొచ్చింది. తన ఎదుగుదలలో తెలుగు సినిమాల పాత్ర ఎప్పటికీ ప్రత్యేకమని వెల్లడించింది. సినిమా రంగంలో విజయాన్ని అందుకోవాలంటే షార్ట్‌కట్స్ వెతకడం కంటే కష్టపడటమే ముఖ్యమని రకుల్ తెలిపింది. కెరీర్ మొదట్లో తాను పెట్టుకున్న లక్ష్యాలు ఇప్పటికీ అలాగే ఉన్నాయని తెలిపారు. నిరంతరం శ్రమిస్తూ, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమే రామాయణం సినిమాలో తన పాత్ర కోసం రకుల్ ప్రత్యేకంగా సిద్ధమయ్యారనే విషయం ఆసక్తికరంగా మారింది. ఈ క్యారెక్టర్‌కు తగిన రూపాన్ని తీసుకురావడానికి మేకప్, కాస్ట్యూమ్స్ విషయంలో చిత్ర బృందం ఎంతో జాగ్రత్తలు తీసుకుంది. ప్రతిరోజూ గంటల తరబడి మేకప్ కోసం కేటాయించిందట. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యశ్ రావణుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా కనిపించారు. ఇంతటి భారీ తారాగణం ఉన్న సినిమాలో రకుల్‌కు శూర్పణఖ పాత్ర దక్కడం విశేషం. తన పాత్ర నిడివి కంటే దాని ప్రాధాన్యతపైనే ఆమె దృష్టి పెట్టింది. ఇప్పటివరకు చేసిన పాత్రలతో పోలిస్తే శూర్పణఖ క్యారెక్టర్ రకుల్‌కు పూర్తిగా భిన్నమైనది. అందుకే ఈ సినిమా ఆమె నటనా ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. కేవలం అందం, గ్లామర్‌తోనే కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతోనూ ప్రేక్షకులను మెప్పిస్తుంది రకుల్.



కొత్త పాత్ర కోసం కసరత్తులు



బ్లాక్‌బస్టర్ 'రంగస్థలం' తర్వాత సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం ఓ క్రేజీ సబ్జెక్ట్‌ని సుకుమార్ సిద్ధం చేసినట్టు వినికిడి. ఇందులో రామ్‌చరణ్ పాత్ర ఆయన కెరీర్‌లోనే అత్యంత బరువైనది, విభిన్నమైనదిగా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. 'పెద్ది' సినిమా కోసం లాంగ్ హెయిర్ పెంచి, ధృఢకాయుడిగా మారారు రామ్‌చరణ్. అలాగే ఈ సినిమాలోని పాత్ర కోసం కూడా ఒక ట్రైనర్‌ని పెట్టుకొని సినిమాకు కావాల్సిన కొత్త లుక్, పర్సనాలిటీ కోసం ఆయన కసరత్తులు మొదలుపెట్టారట. ఈ పాత్రకు కావాల్సిన స్క్రీన్ ప్రెజెన్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసే విషయంలో చరణ్ ఎక్కడా కాంప్రమైజ్ కావట్లేదు.ఈ పాన్ ఇండియా సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నదని సమాచారం. ఇందులో కథానాయిక ఎవరనేది చిత్రబృందం అధికారికంగా ప్రకటించలేదు. సారా అర్జున్, సాత్విక వీరవల్లి, రుక్మిణి వసంత్, భాగ్యశ్రీబోర్సే, శ్రీలీల.. ఇలా చాలామంది కథానాయికల పేర్లు వినిపిస్తున్నాయి. మైత్రీమూవీమేకర్స్, టీ-సిరీస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించే అవకాశం ఉన్నది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com